# BALA CHELIMI

# BALA




# AUG 2024

# August

₹40

అగస్టు - 2024

# బాలచెలిమి

పిల్లల వికాస పత్రిక

# BALA CHELIMI

Telugu Children's Monthly Magazine

సంపుటి : 33 • సంచిక : 11

AUGUST - 2024




Editor : Er. VEDAKUMAR MANIKONDA

A PUBLICATION OF CHILDREN'S EDUCATIONAL ACADEMY, HYDERABAD, TELANGANA

CENTRAL BOOKS
SINCE 1947

Your trusted Academic Partner - Then, Now & Forever

DIAMOND JUBILEE
CELEBRATING 75 YEARS OF
KNOWLEDGE, TRUST & LEADERSHIP



12 lakhs + Customers | 700+ Schools | 15 Business Awards | Online Services | Digital Learning | Books and Stationery Supplies

Head Office : 6-3-553,C1, Quena Square, Erramanzil, Somajiguda, Hyderabad. Tel: 040-24098282
Regd. Office : Central Book Shop #5-9-186, Chapel Road, Abids, Hyderabad.
Warehouses: Plot No. P9/20, Sy. No. 81, IDA, Nacharam, Uppal Mandal, Medchal, Malkajgiri Dist.
Plot No: 1/5B, TSIIC Industrial Development Area, Nacharam, Medchal Dist., Hyderabad.

www.centralbooks.in

# బాలచెలిమి

పిల్లల వికాస పత్రిక

# BALA CHELIMI

Telugu Children's Monthly Magazine

సంపుటి: 33 Volume: 33 | సంచిక : 11 Issue : 11 | హైదరాబాద్ Hyderabad | ఆగస్టు August | పేజీలు Pages 52 | రూ. ₹. 40


## లోపలి పేజీల్లో.......








| | | |
|---|---|---|
| జెండా పండుగ వచ్చిందోచ్... | మణికొండ వేదకుమార్ | 5 |
| ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ (సైంటిస్ట్) | బాలచెలిమి డెస్క్ | 6 |
| రాము తెలివి (కథ) | నారంశెట్టి ఉమామహేశ్వరరావు | 7 |
| డా. లతికా నాథ్ | షీరోస్-256 | 9 |
| స్వచ్ఛమైన అచ్చులు (అక్షరం) | వై. మల్లికార్జున రావు | 10 |
| చెట్టు దిగులు (కథ) | డా. కందేపి రాణి ప్రసాద్ | 11 |
| ప్లమ్ గింజ (కథ) | లియో టాల్ స్టాయ్ | 13 |
| ఎమోజీ (ఎమోజీ దినోత్సవం) | డా. నీరజ అమరవాది | 14 |
| వామన గుంటలు (ఆట) | చిన్ననాటి ఆటలు - జ్ఞాపకాల మూటలు | 15 |
| లౌక్యుడు (కథ) | దాసరి వెంకటరమణ | 16 |
| సమయస్ఫూర్తి (కథ) | సి. హెచ్. ప్రేరణ | 18 |
| ఒలింపిక్స్‌లో చరిత్ర సృష్టించిన భారత్ షూటర్ మను భాకర్ | సచిన్ కోత్వాల్ | 19 |
| తనదాకా వస్తే (నాటిక) | డా॥ కాసర్ల నరేశ్‌రావు | 20 |
| శ్రావణ మాసం (నెలలు) | బాల కథా సౌరభం | 23 |
| లేకుంటే ఎలా? (కవిత) | గద్వాల సోమన్న | 24 |
| పిచ్చుక కుందేలు కథ | పంచతంత్ర కథలు | 24 |
| చింత చెట్టు (చెట్టు - చేమ) | కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి | 25 |
| తగిన మందు (కార్టూన్) | చౌక్కాపు వెంకటరమణ | 26 |
| పాటలు | | 28 |
| వెండి చేప పిల్ల కథ (కథ) | అనిల్ బత్తుల | 29 |
| కాగితపు బొమ్మల కథక్ నృత్యం (సైన్స్) | డాక్టర్ మహీధర నళినీ మోహన్ | 31 |

| | | |
|---|---|---|
| మిఠాయి దొరికింది! (కథ) | వడ్డేపల్లి వెంకటేష్ | 32 |
| ఏమంటావ్ (గేయం) | ఎం. హరికిషన్ | 34 |
| మన ప్రాచీన రాజధాని ఇంద్రపాల నగరం (విహార స్థలాలు) | డా. ద్యావనపల్లి సత్యనారాయణ | 35 |
| చెలిమి క్లబ్ | బాలచెలిమి | 36 |
| రోహన్ చంద్రయాన్ యాత్ర (కథ) | డా. వి.ఆర్. శర్మ | 37 |
| ఎగరేద్దామా సొగసైన మన జెండా (దేశభక్తి గీతం) | దాశరధి | 39 |
| కలం చెలిమి | బాలచెలిమి | 39 |
| పాము, తేలు కాటుకు ప్రథమ చికిత్స (ఆరోగ్యం – విజ్ఞానం) | తెలంగాణ సారస్వత పరిషత్ | 40 |
| అంతరిక్ష విజ్ఞానం (జి.కె.) | తెలంగాణ సారస్వత పరిషత్ | 41 |
| విద్యార్థులే స్ఫూర్తిదాతలు | కాసుల రవికుమార్ | 42 |
| జిరాఫీ (జంతువు) | బాలచెలిమి | 43 |
| ఆడుతూ పాడుకుందాం | బాలచెలిమి | 44 |
| అతిపెద్ద పుస్తకం (కథ).. | బెలగాం భీమేశ్వరరావు | 45 |
| చేతిలో బొమ్మ (నేర్చుకుందామా) | టి.వి.ఎస్. రమేష్ | 46 |
| సమాచారం | సచిన్ కోత్వాల్ | 47 |
| నేనూ నా బాల్యం – చిందు ఎల్లమ్మ (వ్యక్తిత్వం) | వి. పద్మ / బాలచెలిమి డెస్క్ | 50 |




# చెలిమి లేఖలు

ఇంతకు ముందు నాకు కథలు అంటే పెద్దగా తెలియదు. మా పాఠశాల కథల పోటీలో పాల్గొన్నాను. కథలు రాయడంలో మెలుకువలు నేర్చుకున్నాను. ఇప్పుడు కథలు బాగానే రాస్తున్నాను.

**సృజని**
7వ తరగతి, జెడ్‌పిహెచ్ఎస్, కల్లివెట్టు, తిరుపతి

మా పాఠశాలయందు బాలచెలిమి గ్రంథాలయం ఏర్పాటు చేయడం మా అందరి అదృష్టం. ఎందుకంటే ప్రైవేటు పాఠశాలకు మించి ప్రభుత్వ పాఠశాల ఈ రోజు ఇలాంటి సదుపాయాలు కలిగించడం ద్వారా తెలుగును, కథలను, భాషను విద్యార్థులు అనర్గలంగా చదువుతూ భాషపై పట్టు సాధిస్తున్నారు. నిత్యం గ్రంథాలయం పీరియడ్ నందు విద్యార్థులు సంతోషం వ్యక్తపరుచుచున్నారు. తల్లిదండ్రులు ఈ విషయంపై ఆనందం తెలియజేసారు.

**జ్ఞానేశ్వర్**
హెచ్.ఎం., లింగరాజ్‌పేట్, గజ్వేల్, సిద్ధిపేట

నా పేరు చేరాల సాన్విప్రియ. నేను 8వ తరగతి చదువుతున్నాను. ఆరవ తరగతి నుండి కథలు చదవడం, రాయడం చేస్తున్నాను. చిన్నప్పటి నుండి బొమ్మలు వేయడం అంటే ఇష్టం. మా నాన్న ప్రతి నెల ఇస్తున్న బాల చెలిమి పుస్తకం చదువుతున్నాను. కథలు నాకు చాల నచ్చుతున్నాయి. బొమ్మలయితే నాకు చాల ఇష్టం.

**చేరాల సాన్వి ప్రియ**
8వ తరగతి, ఆల్ఫోర్స్ హైస్కూల్, కరీంనగర్

*Olympic Games Paris 2024:*
మను భాకర్

బొమ్మలు:
కూరెళ్ల శ్రీనివాస్
m : 98495 43728




**సంపాదకులు : మణికొండ వేదకుమార్**

BALA CHELIMI
**"CHANDRAM"** 3-6-712/2, St.No.12, Himayatnagar,
Hyderabad - 500 029.
e-mail : edit.chelimi@gmail.com, www.balchelimi.com
Mob: 98480 44713

# జెండా పండుగ వచ్చిందోచ్...

పిల్లలూ...

ఆగస్ట్ 15 అంటే జెండా పండుగ. ఆ రోజు దేశమంతా ఊరూ వాడా మువ్వెన్నల జెండా రెపరెపలాడుతుంది. స్వేచ్ఛా స్వాతంత్ర్యాల విహంగాలు రెక్క విప్పుకొని ఆకాశాన్ని సుందరమయం చేస్తాయి.

రెండు వందల సంవత్సరాల బానిసత్వం నుంచి భారత ప్రజలకు విముక్తి కలిగిన రోజు 1947 ఆగస్ట్ 15. స్వాతంత్ర్య, స్వేచ్ఛా వాయువులు హృదయం నిండా పీల్చుకుని గుండెను జెండాగా ఎగరేసిన రోజు. అయితే ఈ స్వాతంత్ర్యం అంత సులభంగా రాలేదు. దీనికోసం భారత ప్రజలు ఎన్నో త్యాగాలు చేసారు. బ్రిటీష్ పాలనకు మాత్రమే కాక భారత సమాజాన్ని అనేక రూపాల్లో పీడిస్తున్న బానిసత్వానికి వ్యతిరేకంగా వాళ్లు పోరాటం చేసారు. విదేశీ వస్తు బహిష్కరణ, సహాయ నిరాకరణ, ఉప్పు సత్యాగ్రహం, ఖద్దరు ఉద్యమం వంటి వివిధ జాతీయోద్యమ పోరాటాల్లో కుల, మత, ధనిక, పేద, స్త్రీ, పురుష, చిన్నా, పెద్దా తేడాలు లేకుండా కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. అందరి ధ్యేయం, కల ఒక్కటే. అది స్వాతంత్ర్య సాధన.



స్వాతంత్ర్యం అంటే విదేశీ పాలన నుంచి విముక్తి మాత్రమే కాదు. దేశ పౌరులందరికీ చదువు, ఆరోగ్యం, ఉపాధితో పాటు వివక్షతలు లేని, అసమానతలు లేని, అణచివేతలు లేని జీవన భద్రతను కల్పించడం. దీనికోసం మనం ఒక రాజ్యాంగాన్ని నిర్మించుకున్నాం. మన రాజ్యాంగాన్ని గౌరవించుకుందాం. రాజ్యాంగాన్ని రక్షించుకుందాం.

మనం భావి పౌరులం. భారత దేశ భవిష్యత్ రూపకర్తలం మనమే. మన దేశాన్ని సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామిక, గణతంత్ర దేశంగా నిలబెట్టుకుందాం. అప్పుడే మనం ఈ రోజు ఎగరేస్తున్న మువ్వన్నెల జెండా సంబరపడుతుంది.

వేదకుమార్.యం


(మణికొండ వేదకుమార్)

ఎడిటర్ బాలచెలిమి



సైంటిస్ట్

# ఆల్బర్ట్ ఐన్‌స్టీన్



ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ 1879 మార్చి 14న జర్మనీ దేశంలోని వుర్టెంబర్గ్ రాజ్యంలోని ఉల్మ్ ప్రాంతంలో జన్మించారు. వంకర టింకర తలతో పుట్టిన అతనిని చూసి తల్లిదండ్రులు నిరాశ చెందారు. డిగ్రీ పూర్తయ్యాక ఐన్‌స్టీన్ కోసం ఉద్యోగం వెతికిపెట్టేందుకు అతని తండ్రి చాలా కష్టపడ్డారు. తన మీద పెద్దగా నమ్మకం లేని ఐన్‌స్టీన్ సైతం చిన్న ఉద్యోగం వస్తే చాలని అనుకున్నాడు. అప్పట్లో న్యూటనియన్ మెకానిక్స్ కాన్సెప్ట్ సంబంధించి ఎక్కువ రోజులు భవిష్యత్తు ఉండదని ఐన్‌స్టీన్ గమనించారు. ఇదే ఆయన్ను ప్రత్యేకమైన కొత్త సిద్ధాంతం దిశగా నడిపించింది. ఆ విధంగా ఆయన స్విస్ పేటెంట్ కార్యాలయంలో సాపేక్ష సిద్ధాంతం కోసం రిజిస్టర్ చేసేలా చేసింది. జర్మనీ పౌరసత్వాన్ని వదులుకుని స్విట్జర్లాండ్లో స్థిరపడాలని నిర్ణయానికి వచ్చాడు. అక్కడే అతని జీవితం సరికొత్త మలుపు తిరిగింది. ఆయన పనిచేస్తున్న కార్యాలయం శాస్త్రవేత్తల పేటెంట్ హక్కులను నమోదు చేస్తుంది. ఆ విధంగా ఐన్‌స్టీన్ సైతం ఎన్నో పేటెంట్లను పొందాడు. కాంతి యొక్క క్వాంటం సిద్ధాంతం వెనుక ఐన్‌స్టీన్ కీలక వ్యక్తి. 1905లో ఫోటాన్‌లుగా పిలువబడే శక్తి యొక్క ప్యాకెట్‌లను కలిగి ఉంటాయని అతను ప్రతిపాదించాడు, వివరించాడు. ప్రత్యేక సాపేక్ష సిద్ధాంతాన్ని ప్రత్యేక సాపేక్షత అని కూడా అంటారు. ఇది సమయం, స్థలం మధ్య సంబంధానికి సంబంధించిన సిద్ధాంతం. ఈ సిద్ధాంతం రెండు ప్రతిపాదనలపై ఆధారపడి ఉంటుంది. $E=mc^2$ అనే అత్యంత ప్రసిద్ధ సమీకరణం యొక్క మూలాన్ని వివరించడానికి ఈ సిద్ధాంతం ఒక కారణం. ద్రవ్యరాశి మరియు శక్తి సంబంధ సమీకరణం $E=mc^2$.

**ఫోటోఎలెక్ట్రిక్ ప్రభావం:** 1905లో, ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ ఈ సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు, ఇది ఆధునిక భౌతిక శాస్త్రానికి ఆధారం. పదార్థం విద్యుదయస్కాంత వికిరణాలను గ్రహించినప్పుడు మరియు విద్యుత్ చార్జ్ చేయబడిన కణాలు దాని నుండి లేదా లోపల విడుదలైనప్పుడు సంభవించే దృగ్విషయం. ఈ ప్రక్రియలో, లోహపు పలకపై కాంతి పడినప్పుడు దాని నుండి ఎలక్ట్రాన్లు విడుదలవుతాయి. విడుదలయ్యే ఎలక్ట్రాన్లను ఫోటోఎలెక్ట్రాన్లు అంటారు.

**వేవ్-పార్టికల్ ద్వంద్వత్వం :** కాంతి ఫోటాన్‌లను కలిగి ఉంటుందని ఐన్‌స్టీన్ వివరించాడు, వీటిని శక్తి ప్యాకెట్లుగా పరిగణిస్తారు. ఈ భావన కాంతి యొక్క క్వాంటం సిద్ధాంతంలో వివరించబడింది మరియు ప్రదర్శించబడింది. ఐన్‌స్టీన్ కాంతిని ఒక తరంగం మరియు ఒక కణంగా పరిగణించాలని నొక్కి చెప్పాడు.

**సాధారణ సాపేక్ష సిద్ధాంతం :** సాధారణ సాపేక్షత సిద్ధాంతం ప్రత్యేక సాపేక్షత, న్యూటన్ యొక్క సార్వత్రిక గురుత్వాకర్షణ నియమం, గురుత్వాకర్షణను స్థలం మరియు సమయం యొక్క ఆస్తిగా వివరిస్తుంది. ఇది గురుత్వాకర్షణ యొక్క రేఖాగణిత సిద్ధాంతం, ఇది 1915 సంవత్సరంలో ప్రచురించబడింది.


**బోస్-ఐన్‌స్టీన్ కండెన్సేట్ :** గొప్ప భారతీయ భౌతిక శాస్త్రవేత్త మరియు గణిత శాస్త్రజ్ఞుడు సత్యేంద్ర నాథ్ బోస్ ఆల్బర్ట్ ఐన్‌స్టీన్‌తో కలిసి కాంతిని వాయువుగా అర్థం చేసుకోవడానికి ఈ భావనను అభివృద్ధి చేశారు. పరమాణువులు సంపూర్ణ సున్నాకి చాలా దగ్గరగా చల్లబడినప్పుడు, అవి ఒకదానికొకటి కదలలేవని బోస్-ఐన్‌స్టీన్ భావన ప్రతిపాదించింది.

ఐన్‌స్టీన్ తన ఆవిష్కరణల కోసం మాత్రమే కాకుండా, ఆధునిక విజ్ఞాన శాస్త్ర అత్యుత్తమ రచనల కోసం కృషి చేశారు.

బాలచెలిమి డెస్క్

కథ

# రాము తెలివి



పార్వతీపురంలో కార్లు అమ్మే దుకాణం తెరుద్దామని వ్యాపారవేత్త సుందరం అనుకున్నాడు. ఆ వ్యాపారం చూసుకోడానికి ఆయన కొడుకు వివేక్ అంగీకరించడంతో తగిన ఏర్పాట్లు చేసాడు. పురోహితుడిని అడిగి ముహూర్తం నిర్ణయించాడు.

ప్రారంభోత్సవ కార్యక్రమానికి చాలా మంది అతిథులను పిలిచాడు. మొదటి కొనుగోలు కోసం మరో వ్యాపారవేత్తని పిలిచారు.

వచ్చే అతిథులకు సమోసా, మిఠాయి, చల్లని పానీయం ఇవ్వాలని ఏర్పాట్లు చేసారు. అరగంటలో అతిథులంతా వస్తారనగా పానీయపు సీసాలు చల్లబడలేదని తెలిసింది.

తెప్పించిన సమోసాలు, మిఠాయిలు, పానీయపు సీసాలు ఒక గదిలో పెట్టి ప్రారంభోత్సవం కాగానే ఇవ్వాలనుకున్నారు. అయితే పానీయాలు చల్లబడలేదు. అసలే మండుతున్న వేసవి. వాతావరణం వేడిగా ఉంది. అతిథులకు చల్లని పానీయాలు అందిస్తే సంతోషిస్తారన్న సుందరం గారి ఆలోచన దెబ్బ తినేలా అయింది.

"అతిథులకు వేడిగా ఉన్న పానీయాలను ఇస్తామా? ఇంత మంది పనివాళ్లు ఉండీ ఏం చేస్తున్నారు? ఫ్రీజర్ కి కరెంట్ వెళ్లే స్విచ్ వేసారో లేదో చూడక్కరలేదా?" అని కోపంగా అన్నాడు సుందరం.

"మనది కొత్తగా ప్రారంభిస్తున్న దుకాణం కావడంతో విద్యుత్ సరఫరాలో లోపం ఉందేమో స్టెబిలైజర్ కాలిపోయింది. దానిని మరమ్మత్తు చేయించి పానీయాలు చల్లబరచడానికి కొన్ని గంటలు పడుతుంది. ప్రస్తుతానికి బయటి దుకాణాల నుండి కూల్ డ్రింక్స్ తెప్పిద్దాం. మన దగ్గర మిగిలినవి వెనక్కు పంపేద్దాం" అన్నాడు వివేక్ తండ్రితో.

"ఒకేసారి అన్ని సీసాలు ఒకే దగ్గర దొరకవు. చాలా చోట్లకు పంపాలి. అన్ని సీసాలు చల్లటివి సిద్ధంగా ఉంటాయో లేవో" అని సందేహ పడ్డాడు సుందరం.

వాళ్లలా మాట్లాడుతుండగా అతిథుల్లో ఉన్న ఎనిమిదో తరగతి కుర్రాడు రాము విన్నాడు. రాము నాన్న సుందరం దగ్గర పని చేస్తాడు.

ఆ మాటలు వినగానే రాముకి ఒక ఆలోచన

స్ఫురించింది. వెంటనే సుందరం గారితో "అంకుల్ ? చల్లని పానీయాల కోసం ఎవరినీ బయటకు పంపక్కర లేదు.

అతిథులు రాగానే కార్యక్రమాన్ని ప్రారంభించండి. మీరు ప్రారంభోత్సవం పూర్తి చేసేసరకి చల్లని పానీయాలను అందించే కిటుకు నాకు తెలుసు. ఇద్దరు పనివాళ్లని నాకు అప్పజెబితే చాలు" అన్నాడు.

రాము వాళ్ళ నాన్న వచ్చి సుందరం గారితో "వీడు మావాడే. పేరు రాము. వాడిని నమ్మండి" అనడంతో వాళ్లు సరేనన్నారు.

ముఖ్య అతిథి, ఇంకా అతిథులు రావడంతో ఇద్దరు పనివాళ్లని రాముకి అప్పజెప్పి వెళ్లిపోయారు సుందరం, వివేక్.

అనుకున్న ముహూర్తానికే ప్రారంభోత్సవం జరిగింది. వచ్చిన అతిథులందరికీ చల్లటి పానీయాలను అందించారు కుర్రాళ్ళు. కార్యక్రమం అయిపోయాక రాముని పిలిచి ప్రత్యేకంగా అభినందించాడు సుందరం. "ఇంత తొందరగా పానీయాలను ఎలా చల్లబరిచావు?' అనడిగాడు.

"ఇందులో పెద్ద రహస్యమేమీ లేదు. నేను బడిలో తెలుసుకున్న ఫిజిక్స్ సూత్రాన్నే ప్రయోగించాను. మీరేమో కూల్ డ్రింక్స్ తెప్పించాలని చూసారు. కానీ నేనలా చేయకుండా ఐస్ ఫాక్టరీ నుండి నలుపలకలు కలిగిన ఐసు దిమ్మలను తెప్పించాను. ఆ ఐస్ గడ్డలను పానీయపు సీసాలున్న బాక్సుల్లో పెట్టాను. ఆ ఐస్ దిమ్మల మీద ఉప్పుని చల్లితే ఘనీభవ స్థానం మైనస్ నాలుగు డిగ్రీలకు చేరుతుందని నాకు తెలుసు కదా. ఆ సూత్రం ప్రయోగించాను. దాంతో పానీయపు సీసాలు మామూలు కన్నా అతి వేగంగా చల్లబడ్డాయి. ఐస్ క్రీమ్ లేదా కుల్ఫీ తయారీలో ఇదే సూత్రం పాటిస్తారు. మా ఇంట్లో ఆ ప్రయోగం చేసి విజయం సాధించాను. దాన్నే ఇక్కడా అమలు పరిచాను" అన్నాడు రాము.

రాము తెలివి, సమయస్ఫూర్తిని అభినందించారు వచ్చిన అతిథులు. కార్యక్రమానికి రాముని కూడా తీసుకువచ్చినందుకు వాళ్ళ అమ్మ నాన్నలను అభినందించారు.

నారంశెట్టి ఉమామహేశ్వరరావు
m : 9490799203

చందదారులుగా చేరండి! **బాల చెలిమి** చందదారులను చేర్పించండి!

'ఎం.వేదకుమార్ సంపాదకత్వంలో వెలువడుతున్న 'బాల చెలిమి' పిల్లల మాసపత్రిక బాలబాలికలకు చేరడంలో తల్లిదండ్రుల, ఉపాధ్యాయ, పాఠశాల నిర్వహకుల, మేధావుల అమూల్య సహకారాన్ని కోరుతున్నాం. చందదారులుగా చేరడంతోపాటు తమకు తెలిసినవారిని చందదారులుగా చేర్పించాల్సిందిగా అభ్యర్థిస్తున్నాం.

**మా చిరునామా :**
BALA CHELIMI
**"CHANDRAM"** 3-6-712/2,
St.No. 12, Himayatnagar
Hyderabad - 500 029.
Mob: 9030626288
E-mail:desk.chelimi@gmail.com,
www.balchelimi.com

**చందా వివరాలు :**
విడి ప్రతి : రూ. 40
వార్షిక చందా : రూ. 400
2 సం॥లకు : రూ. 750
*'బాల చెలిమి' పేరిట నగదు, చెక్ లేదా ఆన్‌లైన్ రూపంలో చందామొత్తం చెల్లించవచ్చు.*

**ACCOUNT DETAILS :**
Bank Name : Canara Bank
A/C No. : 30101010003714
Branch : Ashoknagar, HYDERABAD.
IFSC Code : CNRB0013010

# డా. లతికా నాథ్

## లెన్స్ మరియు యాక్షన్ ద్వారా వన్యప్రాణులను సంరక్షిస్తున్నారు

డా. లతికానాథ్ రచయిత్రి, వన్యప్రాణి ఫొటో గ్రాఫర్, TEDX స్పీకర్ మరియు పరిరక్షకురాలు. ఆమె ఢిల్లీ కళాశాల నుండి పర్యావరణ విజ్ఞానంలో డిగ్రీని, యుకెలోని బాంగోర్‌లోని కాలేజ్ ఆఫ్ నార్త్ వేల్స్ నుండి గ్రామీణ వనరుల నిర్వహణలో మాస్టర్స్ డిగ్రీని పొందారు. ఆమె పిహెచ్.డి.ని పూర్తి చేసారు. ప్రారంభంలో వన్యప్రాణుల సంరక్షణపై పని చేస్తూ వివిధ సంస్థలతో కలిసి పని చేసారు. ఆమె "ఓమో వేర్ టైమ్ స్టాండ్ స్టిల్", "హిడెన్ ఇండియా - ఎ జర్నీ టు వైల్డ్ లైఫ్", "తక్దీర్ ది టైగర్ కబ్" వంటి అనేక చలన చిత్రాలకు, పరిశోధనా ప్రాజెక్టులలో పని చేసింది. ఆమె అకడెమిక్ పబ్లికేషన్స్, నేషనల్ జియోగ్రాఫిక్, బిబిసి వైల్డ్ లైఫ్‌లలో అనేక వ్యాసాలు రాసారు. పులులు, సింహాలు, చిరుతలు, జాగ్వర్లు, మంచు చిరుతలు, మేఘాల చిరుతలు, ఆసియా ఏనుగులు, గంగానది డాల్ఫిన్లు, అడవి నీటి గేదె వంటి వివిధ వన్యప్రాణుల జాతులను ఫొటోలు తీయడానికి ఆమె చేసిన కృషి ఆమెను ప్రపంచవ్యాప్త ప్రయాణాలకు తీసుకెళ్ళింది. న్యూఢిల్లీలోని బికనీర్ హౌస్ వంటి ప్రతిష్ఠాత్మక ప్రదేశాలలో ఆమె తన పనితనాన్ని ప్రదర్శించింది. డా. నాథ్ సేవ్ ది టైగర్ ఫండ్ స్కాలర్ షిప్, ఓవర్సీస్ రీసెర్చ్ స్టూడెంట్ స్కాలర్ షిప్, కర్మవీర్ పురస్కారంతో సహా అనేక అవార్డులను, స్కాలర్‌షిప్‌లను అందుకున్నారు. పర్యావరణ పరిజ్ఞానం, వన్యప్రాణుల సంరక్షణపై డా.నాథ్ చేసిన కృషి అనేక డాక్యుమెంటరీలలో ప్రదర్శించబడింది. ఆమె అంకిత భావం, కృషి ఆమెను వన్యప్రాణుల సంరక్షణ రంగంలో మెచ్చుకునేలా చేసింది. ఆమెను "ది టైగర్ ప్రిన్సెస్" అని కూడా పిలుస్తారు. ఆమెకు "హర్ డేరింగ్‌నెస్" అనే బిరుదు లభించింది.




– 'షీరోస్–256 ఇన్‌స్పైరింగ్ వుమెన్ ఫ్రమ్ ఇండియా' నుండి....

అక్షరం

# స్వచ్ఛమైన అచ్చులు



ఏ భాషకైనా అచ్చులు మూలాధారం. అక్షర దోషాలు లేకుండా, నిర్ధారిత ఆకారంలో అక్షరాలు రాయడం మన బాధ్యత.

అ ఆ /ఇ ఈ / ఉ ఊ/ ఎ ఏ ఐ/ ఒ ఓ ఔ / అం అః అని ఆరు గ్రూపులుగా విభజించి వీటిని అభ్యసించాలి.

ఈ గ్రూపులు ఉచ్చారణలో మాత్రమే కాక, అక్షరాల ఆకారాలలో కూడా సారూప్యతను కలిగి ఉండటం వీటి ప్రాధాన్యత. (ఇ ఈ... లలో తప్ప)

అ ఆ ఇ ఈ ఉ ఊ

అ ఆ ఇ ఈ ఉ ఊ

ఋ ౠ ఎ ఏ ఐ

ఋ ౠ ఎ ఏ ఐ

ఒ ఓ ఔ అం అః

ఒ ఓ ఔ అం అః

ముందుగా చుక్కలతో చూపబడిన అక్షరాలను ఒకటికి రెండు సార్లు దిద్ది, అదే ఆకారంలో వీటిని విడిగా, వేరే పుస్తకంలో రాసి చూసుకోవాలి.

పదిహేను సంవత్సరాలలోపు పిల్లలందరూ ఈ అక్షరాలను అభ్యసిస్తున్నప్పుడు ఉచ్చరిస్తూ రాస్తే మంచిది. దీనివల్ల అక్షరాలను రాసే వ్యక్తికి, రాస్తున్న అక్షరమునకు అనుసంధానం కావడానికి ఎంతగానో ఉపకరిస్తుంది.


ఆ విధంగా అక్షరాల మీద పట్టు సాధించిన తర్వాత ఆ అక్షరం ఎన్నిసార్లు రాసినా అదే ఆకారంలో, పరిమాణంలో, నిటారుగా రాసే విధంగా ఒకే అక్షరాన్ని మరిన్ని సార్లు అభ్యసిస్తూ నేర్చుకోవాలి.

– వై. మల్లికార్జున రావు
డైరెక్టర్, మహా అకాడెమి, m : 9966961642



కథ

# చెట్టు దిగులు




రెండు పెద్ద చెట్లు పక్కపక్కనే ఉన్నాయి. ఆ రెండూ మంచి స్నేహితులు. రోజూ చక్కగా మాట్లాడుకుంటాయి. తమ కష్టసుఖాలను ఒకళ్లకొకళ్లు చెప్పుకుంటాయి. సంతోషంగా ఉన్నప్పుడు తమ తలలు తాటించుకొని నవ్వుకుంటాయి. బాధల్లో ఉన్నప్పుడు కొమ్మల చేతుల ద్వారా ఒకరి కన్నీళ్లను మరొకరు తుడిచి కష్టాన్ని పంచుకుంటాయి. ఇంత స్నేహంగా ఉన్న ఈ రెండు చెట్ల మధ్యలో ఒక ప్రహరీ గోడ ఉన్నది. ఈ ప్రహరీ గోడ ఒక స్కూలుది. ఇందులో ఒక చెట్టేమో చిన్న పిల్లల స్కూలులో ఉన్నది. మరొక చెట్టేమో స్కూలు పక్కన ఉన్న ఖాళీ స్థలంలో ఉన్నది. దీనికో సమస్య ఆ స్థలం ఖాళీగా ఉంది కదా అని ఆ వీధి వారందరూ చెత్త అక్కడే తెచ్చి పోస్తారు. ఆ వాసన భరించలేక ఆ చెట్టు రోజూ బాధపడుతూ ఉంటుంది. అదే సమస్యను తన మిత్రునితో చెప్పి తన బాధల బరువును కొంత తగ్గించుకుంటుంది. ప్రహరీగోడ అడ్డుగా ఉన్నా ఆ రెండింటి స్నేహానికి ఏ అడ్డంకీ రాలేదు. రెండూ వేర్వేరు ఇళ్లలో పుట్టినా ఒకటే మనసు ఒకటే ప్రాణంగా పెరిగాయి.

ఖాళీ స్థలంలో ఉన్న చెట్టు, స్కూల్లోని చెట్టుని చూసి మురిసిపోతుంది. ఎంత అదృష్టం తన మిత్రునికి. రోజూ తనలా దుర్గంధం పీల్చుకుంటూ బతకాల్సిన ఖర్మలేదు. పైగా పిల్లల స్కూలు కాబట్టి చక్కని పాల బుగ్గల పసి వాళ్లు బుడి బుడి అడుగులు వేసుకుంటూ వస్తుంటే ఆ చెట్టు తన కొమ్మలు వంచి ఆకులతో వాళ్ల ఒళ్లు నిమురుతూ ఉంటుంది. పొద్దున పూట మాస్టార్లు వచ్చేదాకా మరియు ఇంటర్వెల్లోనూ పిల్లలు ఈ చెట్టు కింద నిలబడే గలగల మాట్లాడుకుంటూ ఉంటారు. వాళ్ల ముద్దు ముద్దు మాటలు, కిలకిల నవ్వులూ వింటూ పొంగిపోతుంది. ఇంకా డ్రిల్ పీరియడ్ లో మైదానంలోనే కోకో, కబడ్డీ ఆటలు ఆడుతూ ఉంటే ఒళ్లు మరచి తన్మయత్వంతో చూస్తుంటుందా చెట్టు. అప్పుడప్పుడు తనతో ఓ మాట చెప్తుంటుంది గర్వంగా.

"పువ్వులు పూసే కాలం రానివ్వు. నా కొమ్మలు, ఆకులు కూడా కన్పించకుండా ఒళ్లంతా పువ్వులే పూస్తాను. బుట్టలు బుట్టలు పూలు పూస్తాను నేను".

"ఓయ్! మీ స్కూలు పిల్లల కోసమా ఈ పూలు.

ఇప్పటి పిల్లలు తలలో పూలు పెట్టుకోవడానికి వాళ్లకు జడలు లేవు పూర్వకాలంలోలాగా. ఇప్పటి ఆడపిల్లలకు క్రాఫులే కదా! మరేం చేస్తావు అంత విరగబూసి" కొంచెం ఉడికిస్తూ అడిగింది మిత్రురాలిని.

"వాళ్ల జడల్లోకి కాదులే మిత్రమా! నేను గంపలు గంపలు పూలు పూసి కింద రాలిస్తే పసివాళ్లు నా పూలమీద నడుచుకుంటూ వెళతారు. వారి పసి పాదాలు కందిపోకుండా నా పూల కార్పెట్‌ను పరుస్తా. నేల మీద నున్న మట్టి ఇసుక గుచ్చుకోకుండా ఉంటాయి. చిన్నారులు నా పూల కార్పెట్ పై నడుచుకుంటూ వెళ్తుంటే వారి మృదువైన పాదాలు... అబ్బబ్బ ఊహించు కుంటుంటేనే ఎంత మధురంగా అనిపిస్తుంది" అన్నది ఎంతో తన్మయత్వంగా. దాని ఆనందం చూస్తుంటే తనకి గర్వంగా అనిపించింది. ఇంత మంచి మనసు ఉన్న చెట్టుతోనా నేను స్నేహం చేస్తున్నది. ఎంత అదృష్టం నాది అనుకుంటూ పొంగిపోయింది.

తెల్లవారి అలవాటు ప్రకారం 'మిత్రమా!' అని పలకరించబోయేసరికి దిగాలు మొహం పెట్టుకొని కనిపించింది స్కూల్లోని చెట్టు. "ఏమిటి అంత దిగాలుగా ఉన్నావు? నిన్ననే కదా నీ స్వప్నాన్ని ఎంతో ఆనందంగా పంచుకున్నాం. ఈరోజు ఎందుకు అలా ఉన్నావు? అన్నదో లేదో ఆ చెట్టు బొటబొటా కన్నీళ్లు కార్చేసింది.

ఏదో చెప్పాలనుకుంటున్నది గానీ మాట పెగలటం లేదు. తను కన్నీళ్లు తుడుస్తూనే ఉంది 'ఏం కాదులే' అన్నట్లుగా. మెల్లిగా వెక్కిళ్ల మధ్య అసలు విషయం చెప్పింది. నిన్న స్కూల్లోని మాస్టారు ఈ చెట్టు కొమ్మను విరిచి బెత్తంగా చేసి పిల్లలు అల్లరి చేస్తున్నారని అందర్నీ బాదాడట. ఆ పిల్లల వీపుల మీద వాతలు తేలాయట. అందరూ ఒకటే ఏడుస్తూ కూర్చున్నారట. ఆ చెట్టేమో వాళ్ల పాదాలు కందిపోకుండా పూల కార్పెట్ పరవాలని కల కంటే, ఆ మాస్టారేమో దీన్ని పిల్లల వీపుల మీద వాతలు తేల్చే బెత్తంగా మార్చేశాడు. తనకు నోట మాట రాలేదు. అసలు ఏం సమాధానం చెప్పి ఊరడించాలో కూడా తనకు అర్థం కాలేదు.

– డా. కందేపి రాణీప్రసాద్
m : 9866160378

## సామెతలు

- ఇనరానోడువోయి ఇల్లుగాలవెట్టే
- బొట్లబొట్ల బోనాల కుండ మెల్లగ దించురా బెల్లంకుండ
- భయం లేని కోడి బజార్ల గుడ్లు పెట్టే
- తిన బుద్దాయె అడుగ సిగ్గాయె

– ఎం. రేవణ్య
9వ తరగతి, లింగాపూర్, కామారెడ్డి.

- నిండు కుండ తొణకదు
- అడుసు తొక్కనేల కాళ్ళు కడగనేల
- ఎవరికివారే యమునా తీరే
- అందని ద్రాక్ష పుల్లన
- అప్పు చేసి పప్పు కూడు
- కోటి విద్యలు కూటి కోసమే
- బూడిదలో పోసిన పన్నీరు
- పిల్లికి ఎలుక సాక్ష్యం
- రెక్కాడితే గాని డొక్కాడదు
- మూలిగే నక్క మీద తాటికాయ పడ్డట్టు

– బాలచెలిమి

కథ



# ప్లమ్ గింజ

అమ్మ ప్లమ్పళ్లు కొని ఇంటికి తెచ్చి, అన్నం తిన్నాక పిల్లలకు ఇద్దామని పళ్లెంలో వుంచింది. వాన్య అంతకు ముందెన్నడు ప్లమ్పళ్లు తినలేదు. వాసన చూసి బాగున్నాయనుకున్నాడు. వాటిని రుచిచూడాలని వాన్యకి ఎంతగానో అనిపించింది. గదిలో ఎవ్వరూ లేకపోవడం చూసి, ఇక ఉండలేక, చప్పున ఓ పండు తీసుకుని తినేశాడు. భోజనానికి ముందు అమ్మ ప్లమ్పళ్లను లెక్కపెట్టింది – ఒక పండు తక్కువైంది. ఆమె వెళ్లి ఆ సంగతి భర్తతో చెప్పింది.




భోజనమప్పుడు నాన్న: “ఏమర్రా, పిల్లలూ! మీలో ఎవరైనా ఓ ప్లమ్పండు తిన్నారా ఏమిటి?” అని అడిగాడు. “అబ్బే మేం తినలేదే!” అన్నారు పిల్లలందరూ. గీసిన కందగడ్డలా వాన్య ముఖం ఎర్రబడింది. “అబ్బే, నేను తినలేదు!” అన్నాడు వాన్య కూడా.

అప్పుడు నాన్న అన్నాడు: “మీలో ఎవరో ఒకరు తినే వుండాలి, కాని మీరు తినలేదంటున్నారు. ఇదేమి బాగులేదు. అయితే, అసలు సంగతి ఏమిటంటే ప్లమ్పండులో గింజ వుంటుంది. గింజను వుమ్మేయకుండా, దానిని మింగేసిన వాడిని మాత్రం మరునాటికి హాస్పిటల్‌లో చేర్చవలసి ఉంటుంది. చచ్చిపోతాడు. అందుకని నాకు బెంగగా వుంది.”

వాన్య వెలవెలబోయి: “లేదు, నాన్న! గింజను కిటికీలోనుంచి వుమ్మేశాను, నాన్నా!” అన్నాడు. అందరూ ఫక్కున నవ్వారు. వాన్య మొఖము దించుకున్నాడు.

**లియో టాల్‌స్టాయ్ బాలల కథలు నుండి**



# ఎమోజీ

పిల్లలూ స్కూళ్లు తెరిచేసారుగా. కొత్త పుస్తకాలు, కొత్త స్నేహాలతో ఉత్సాహంగా ఉన్నట్లున్నారు. మీకు పరీక్షలు కూడా మొదలయ్యాయా? మీరు బాగా హోం వర్క్ చేస్తేనో లేక మంచి మార్కులు తెచ్చుకుంటేనో పుస్తకంలో మార్కులతో పాటు టీచరు చిన్న స్మైలీ బొమ్మను వేస్తారు కదా..! అలాంటి బొమ్మలను 'ఎమోజీ' అంటారు. ఈ పదం రెండు జపనీస్ పదాల నుండి పుట్టింది. 'ఎ' అంటే చిత్రం. 'మోజి' అంటే వ్రాతపూర్వక సంభాషణ యొక్క బాడీ లాంగ్వేజ్. 'షిగెటకా కురిటా' అనే జపనీస్ ప్రోగ్రామర్ 1999లో ఎమోజీలను కనిపెట్టాడు. ఒక రకంగా ఇవి వ్రాత పూర్వక సంభాషణ యొక్క బాడీ లాంగ్వేజ్.

పేజర్లలో చిన్న మెసేజ్‌ను ప్రభావంతంగా చెప్పేందుకు ఎమోజీలను రూపొందిచారు. ఆలోచనలు మరియు సందేశాలను తెలియజేయగల సామర్థ్యం కారణంగా ఎమోజీలు విశ్వవ్యాప్త భాషగా మారాయి. డిజిటల్ కమ్యూనికేషన్ పై ఎమోజీ చూపిన ప్రభావాన్ని గౌరవించేందుకు ఎమోజీపీడియా వ్యవస్థాపకుడు జెరెమీ బర్గే 2014 నుండి ప్రతి సంవత్సరం జులై 17వ తేదీని ప్రపంచ ఎమోజి దినోత్సవాన్ని జరుపుతున్నారు. కాలండర్ ఎమోజీలో జులై 17వ తేదీ కనబడుతుంది. అందుకనే ఆ రోజుని ఎంచుకున్నారు.

1982లో 'స్కాట్ ఫాల్ మన్' అనే కంప్యూటర్ సైంటిస్ట్ :-), :-( వంటి చిహ్నాలు భాషను భర్తీ చేయగలవని సూచించాడు. :-)చిహ్నాన్ని ఆనందాన్ని వ్యక్తపరచడానికి, :-( చిహ్నాన్ని విచారం ప్రకటించడానికి మొదట ఉపయోగించాడు. కొన్ని సంకేతాల ద్వారా భావాన్ని వ్యక్తపరచవచ్చు. నవ్వు, ఏడుపు, కోపం, ఆశ్చర్యం లాంటి భావోద్వేగాలను కేవలం సంజ్ఞల ద్వారా కూడా టెక్స్ట్ మెసేజ్‌లో పంపవచ్చు. ఆ సంజ్ఞలే తదనంతర కాలంలో ఎమోజీలుగా రూపుదిద్దుకున్నాయి. ఎమోజీలను చిత్రాలతో చూపెడతారు. అంటే పిక్టోగ్రామ్ రూపంలో ఉంటాయి. ఎమోజీలను పిక్టోగ్రామ్, లోగోగ్రామ్, ఐడియోగ్రామ్‌లని కూడా అంటారు. టెక్స్ట్ మెసేజింగ్‌కు విజువల్ మోడ్ ఎఫెక్ట్‌ను ఎమోజీలు అందించగలవు.

కేవలం మానవ భావోద్వేగాలనే కాక జంతువులు, భౌగోళికం, ఆహారాలు, జెండాలతో సహా అనేక రకాల వస్తువులు మరియు ఆలోచనలను వ్యక్తీకరించడానికి ఎమోజీలు ఉపయోగపడతాయి. సందేశాలకు వినోదభరిత స్పర్శను జోడించడానికి ఎమోజీలను ఉపయోగిస్తారు. ఈ చిన్న డిజిటల్ చిహ్నాలు భాష కన్నా గొప్పగా కమ్యూనికేట్ చేయగలుగుతున్నాయి. వీటిని instragram, whatsapp, twitter మొదలగు ఇతర ప్లాట్ ఫామ్‌లలో కూడా వినియోగిస్తున్నారు. అత్యంత ప్రజాదరణ పొందిన ఎమోజీలకు అవార్డులు కూడా ఇస్తారు.

ఎమోజీలను ప్రచారానికి బాగా ఉపయోగించు కుంటున్నారు. దీని జనాదరణ ఎమోజీల సార్వత్రిక ఆకర్షణను, సాంస్కృతిక ప్రభావాన్ని ప్రతిబింబిస్తుంది. ధ్వనితో కూడిన ఎమోజీలను కూడా ప్రవేశపెడుతున్నారు. ప్రతి సంవత్సరం 'యూనికోడ్ కన్సార్టియా' ద్వారా ఎమోజీల జాబితా ప్రచురింపబడుతుంది. ఆమోదింప బడుతుంది.

పిల్లలూ మీరు కూడా కొత్త కొత్త ఎమోజీల గురించి ఆలోచించండి. మనం కూడా ఎమోజీలతో కమ్యూనికేట్ చేయడానికి ప్రయత్నిద్దాం.!!

– డా.నీరజ అమరవాది
m : 9849160055

ఆట

# వామన గుంటలు



**ఎంతమంది పాల్గొనవచ్చు - ఇద్దరు**
**ఎక్కడ ఆడవచ్చు - ఇంట్లోనైనా, బయటైనా**
**ఈ ఆటకు గల ఇతర పేర్లు - వానగుంటలు, ఒనగండ్లు, బద్దీలాట, ఓమన గుంటలు**

'వామన గుంటలు' ఆటను గవ్వలు, చింతగింజలు మొదలైన వాటితో ఆడతారు. రెండు వరుసలు ఏడేసి గుంటలు గల పీటని ఉపయోగిస్తారు. వామన గుంటల పీట సాధారణంగా కొయ్యతో తయారు చేస్తారు. రెండు వరుసల్లో ఏడు గుంటల చొప్పున మొత్తం 14 గుంటలు ఉంటాయి. ప్రారంభంలో ప్రతీ గుంటలో 5 గింజలు నింపాలి. చింత గింజలు కానీ, గవ్వలు కానీ, చిన్న చిన్న రాళ్లు కానీ నింపవచ్చు.

పంచడం: సాధారణంగా ఇద్దరు ఆడే ఈ ఆటలో పీట యొక్క ఒక సగ భాగములోని ఏడు గుంటలు ఒకరికి చెందుతాయి. మిగిలిన సగ భాగములోని ఏడు గుంటలు ఎదుటి వారికి చెందుతాయి. ఆట ప్రారంభంలో ఒక ఆటగాడు ఒక గుంటలోని రాళ్లను మొత్తం తీసుకొని ఖాళీ చేసిన గుంటకు కుడివైపు గుంటతో ప్రారంభించి వరుసగా ఒక్కొక్క గుంటకు ఒక గింజ చొప్పున పంచడం ప్రారంభిస్తాడు. చేతిలోని గింజలన్నీ అయిపోతే ఆ తరువాత గుంట (ఈ గుంట ఎవరిదైనా కావచ్చు) లోని రాళ్లను తీసి పంచడం కొనసాగిస్తాడు. ఇలా చేతిలోని గింజలన్నీ అయిపోయి ఆ తరువాత గుంట పంచడానికి వీలులేకుండా ఖాళీ గుంట వచ్చే వరకు ఒకే వ్యక్తి పంచుతుంటాడు.

అలా చేతిలోని గింజలన్నీ అయిపోయి ఆ తరువాత ఖాళీ గుంట తటస్థ పడితే ఆ ఖాళీ గుంట తరువాత గుంటలో ఉన్న గింజలన్నీ పంచిన వ్యక్తి గెలుచుకుని గుంటలో నుండి తీసుకొని పక్కన పెట్టుకుంటాడు. తరువాత ఎదుటి వ్యక్తికి అవకాశం వస్తుంది. అలాగే ఖాళీ గుంట తటస్థపడి దాని తరువాత గుంట కూడా ఖాళీగా ఉంటే తడవు ముగుస్తుంది. కానీ గింజలు మాత్రం ఏమీ గెలుచుకోరు. ఆ తరువాత ఎదుటి ఆటగానికి పంచే తరుణం వస్తుంది. పంపకం మాత్రం మన సగ భాగములోని గుంటలతోనే ప్రారంభించాలి. ఆట చివరి దశలలో ఒక ఆటగానికి పంచే తరుణం వచ్చినా పంచడం ప్రారంభించడానికి తన సగ భాగములోని గుంటలన్నీ ఖాళీగా ఉంటే పంచలేడు. ఇక పంచే అవకాశము తిరిగి ఎదుటి వ్యక్తికి ఇవ్వవలసిందే. వరుసగా పంచేటప్పుడు ఒక గుంటలో పంచకుండా దాటెయ్యడము, వ్యతిరేక దిశలో పంచడము నిషిద్ధము. ఒక వ్యక్తి పంచుతుంటే అవతలి వ్యక్తి జాగ్రత్తగా గమనిస్తూ ఉంటాడు.

ఇలా ఒకరి తర్వాత ఒకరు పీటలోని గుంటలన్నీ ఖాళీ అయ్యేదాకా ఆడతారు. చివరలో ఎవరెన్ని గింజలను గెలుచు కున్నారో లెక్క పెడతారు. అత్యధిక గింజలు గెలుచుకున్న వారే విజేతలు. రామాయణ కథలో సీతాదేవి కూడా వామన గుంటలు ఆడినట్టు ఉంది. ఈ ఆట ఆడేటప్పుడు రాళ్ళను కదిలించే ముందు ఆలోచన చేయాలి. ప్రయోజనం: రెండు వ్యూహాలను పోల్చటము వాటిలో ఏ వ్యూహము లాభసాటిగా వుంటుందో బేరీజు వెయ్యటము వస్తుంది.

**- 'చిన్ననాటి ఆటలు-జ్ఞాపకాల మూటలు' నుండి...**

కథ

# లౌక్యుడు



**మనిషి మనసు పుట్ట!**
**ఏ పుట్టలో ఏ పాముందో ఎవరి కెరుక?**
**ఎప్పటి కెయ్యది ప్రస్తుతం**
**అప్పటికా మాటలాడి అన్యుల మనముల్**
**నొప్పివ్వక తానొవ్వక అప్పివ్వక**
**అన్యులలో తప్పించుక తానెంచక**
**మెప్పించుకు ఒప్పించుకు చొప్పించుకు**
**తిరుగువాడు 'లౌక్యుడు' సుమతీ!**

శంకరయ్య అనే గ్రామస్థుడొకాయన, పని వుండి పొరుగు గ్రామం వెళ్ళి, రాత్రి తిరిగి వచ్చేటప్పుడు పొలం గట్లమీద నడుస్తూ, కాలుజారి పక్కనే వున్న చిన్న ఊబిలో పడి దానిలో కూరుకుపోయాడు. ఆయన బయట పడాలని ప్రయత్నించిన కొద్దీ, ఇంకా లోతుకు దిగబడి పోసాగాడు. ఇక లాభంలేదని బయటపడే ఆశ వదులుకుని, ఆ రాత్రంతా ఊబిలోనే కదలకుండా అలాగే వుండిపోయాడు.

తెలతెలవారుతూండగా, ఆ మసక చీకట్లో దూరాన్నుంచి ఎవరో తనకేసి వస్తూండడం గమనించాడు శంకరయ్య. ఆ వచ్చేవాడు తనను చూసి ఏదో భూతం అని పారిపోకముందే, త్వరగా రమ్మని గట్టిగా కేకవేసి పిలిచాడు. అతను దగ్గిరకు రాగానే, తన పరిస్థితి చెప్పి పైకి లాగమన్నాడు.

వాడు నానా తంటాలుపడి, అతికష్టం మీద శంకరయ్య భారీశరీరాన్ని పైకి లాగి, ఆ ప్రయత్నంలో కాలి పట్టుతప్పి, తను ఊబిలో పడిపోయాడు. శంకరయ్య జరిగినదానికి నొచ్చుకుంటూ వాణ్ణి పైకి లాగి నిలబెట్టాడు.

ఆ చుట్టుపక్కల ఎక్కడా నీరు లేకపోవడంతో, ఇక చేసేదిలేక ఇద్దరూ బురదకొట్టుకున్న దుస్తులతో గ్రామం కేసి బయలుదేరారు. మాటల సందర్భంలో, ఆ వ్యక్తి పేరు శేఖరుడనీ, దూరగ్రామం నుంచి వస్తున్నాడనీ, శంకరయ్య తెలుసుకున్నాడు. "మా ఊళ్ళో నీకేం పని?" అని అడిగాడు శంకరయ్య.

"మీ గ్రామంలో శంకరయ్యగారనే పెద్దమనిషితో పనిపడి వస్తున్నాను" అన్నాడు శేఖరుడు. ఆ జవాబుకు శంకరయ్య ఆశ్చర్యపోయి "ఆయనతో ఏం పని?" అని అడిగాడు.

"అది తమకు చెప్పేది కాదులెండి" అంటూ శేఖరుడు తన నడుమువరకూ అంటుకున్న బురదకేసి చూసుకుని, "దీన్ని వదిలించుకునే మార్గం చెప్పి, గ్రామంలో కాస్త ఆ శంకరయ్య గారిల్లెక్కడో చూపించండి" అన్నాడు. శంకరయ్య జవాబేమీ ఇవ్వకుండా వూరుకున్నాడు.

వాళ్ళు గ్రామం చేరేసరికి జాము పొద్దెక్కింది. బురద కొట్టుకున్న దుస్తుల్లోవున్న వాళ్ళిద్దర్నీ గ్రామస్థులు

వింతగా చూడసాగారు. ఆ సమయంలో అటుగా వెళు తున్న షావుకారు చిన్నయ్య, శంకరయ్యను, "ఈ అవతారం ఏమిటి?" అని అడిగాడు.

శంకరయ్య అతడికి శేఖరుణ్ణి చూపుతూ, "నేను పొరుగూరు నుంచి తిరిగివస్తున్నాను. ఈయన పాపం, ఒక పొలంగట్టు పక్కన ఉన్న ఊబిలో కూరుకుపోయి కనిపించాడు. బయటికి లాగే ప్రయత్నంలో, నేను కాలుజారి ఊబిలో పడ్డాను" అంటూ బిగ్గరగా నవ్వాడు. చిన్నయ్య కూడా నవ్వుతూ వెళ్ళిపోయాడు. రెండు సందు మలుపులు తిరిగేసరికి, ఒక ముసలాయన ఎదురుపడి శంకరయ్యను షావుకారు చిన్నయ్య అడిగిన ప్రశ్నే అడిగాడు. దానికి శంకరయ్య చిరునవ్వు నవ్వుతూ, "రాత్రి పొరుగూరు నుంచి వస్తూ ఊబిలో పడ్డాను. ఈయనెవరో దేవుడిలా వచ్చి, నన్ను రక్షించాడు" అన్నాడు.

ఆ సందుమలుపు తిరుగుతూండగా, మరొకతను శంకరయ్యను, మొదటి ఇద్దరు అడిగినట్టే అడిగాడు. "వేకువ జామున పొరుగూరు నుంచి వస్తూంటే, పాపం, ఎవరిదో ఎడ్లబండి ఊబిలో దిగబడి వుండడం కనిపించింది. ఈయనా, నేనూ కలిసి బండివాళ్ళకు సాయం చేశాం. అందువల్లనే, మా అవతారాలు ఇలా తయారయినై" అన్నాడు శంకరయ్య.

శేఖరుడికి, శంకరయ్య ప్రవర్తన అర్థం కాలేదు. అతను, శంకరయ్యను, "అయ్యా! నాదొక అనుమానం. మీరు అడిగిన ప్రతి ఒక్కరికీ, ఒక్కొక్క రకంగా కారణం చెబుతున్నారు. ఎందువల్ల?" అని అడిగాడు.

"నీకు శంకరయ్యతో పనేమిటో చెప్పనప్పుడు, నేను మాత్రం నీవడిగిన దానికి జవాబెందుకు చెప్పాలి?" అన్నాడు శంకరయ్య. "మీరు ముందు నా సందేహం తీర్చండి. తర్వాత, నేను ఈ గ్రామం వచ్చిన పని చెబుతాను" అన్నాడు శేఖరుడు. శంకరయ్య అందుకు సరేనన్నట్లు తలవూపి, "ఈ గ్రామంలో ఎక్కువ పొలం, పలుకుబడీ, పరపతీ వున్న పెద్ద మనుషుల్లో నేనొకణ్ణి. అలాంటి నేను ఊబిలో కూరుకుపోయి, రాత్రంతా చలిలో అవస్థ పాలైనానంటే, ఎంత పరువు తక్కువ! ఈ విషయం తెలిస్తే అందరూ చాటుమాటున నా గురించి నవ్వుకోరా?" అన్నాడు.

"అలా అంటారేం! ఏ క్షణాన ఏ మనిషికేం జరుగుతుందో చెప్పలేం గదా!" అన్నాడు శేఖరుడు. "ఆ మాట నిజమే. ఇది మారుతూన్న కాలం. నువ్వు చెప్పిన విషయం గురించి ఎవరూ ఆలోచించరు" అన్నాడు శంకరయ్య.

"మరి అయితే ఒక ముసలాయనకు నిజం చెప్పారు. కారణం ఏమిటి?" అని ప్రశ్నించాడు శేఖరుడు. ఆ ప్రశ్నకు శంకరయ్య పెద్దగా నవ్వి, "ఆ ముసలాయన ఇటువంటి స్వల్ప విషయాలను పట్టించుకునే రకం మనిషి కాదు. ఎవరు ఏ గంగలో దూకినా, దూకక పోయినా తనకు ఒరిగేదేం లేదనుకుంటాడు అతడికి నిజం చెప్పినందువల్ల నాకు వచ్చే నష్టం ఏమీలేదు. మిగతా వాళ్ళందరికీ, వారి వారి మనస్తత్వాలకు సరిపడేలా చెప్పాను" అన్నాడు.


"అంటే, ప్రతి చిన్న విషయం గురించీ మీరంత లౌక్యం ప్రదర్శిస్తారన్నమాట!" అంటూ శేఖరుడు ఆశ్చర్యపోయాడు. "ఇంతకూ, శంకరయ్యతో ఏం పనో చెప్పావుకాదే?" అన్నాడు శంకరయ్య.

అందుకు శేఖరుడు, "నాకు లౌక్యం బొత్తిగా తెలీదండి. ఎవరితో ఎలా మాట్లాడాలో చేతగాదు. ఈ విషయంలో శంకరయ్యగారి సలహా విందామని వచ్చాను. వారి గురించి వినడం తప్ప, ముఖపరిచయం లేదు," అంటూ కొంచెం ఆగి "అయ్యా, కొంపదీసి శంకరయ్య గారు తమరు కాదు కదా?" అని అడిగాడు.

"కాదు! కాని, శంకరయ్యా, నేను మంచి స్నేహితులం," అన్నాడు శంకరయ్య. "అలాగాండి! సరే, ఆయనతో ఇప్పుడిక అవసరం లేదండి. నేనొచ్చిన పని అయిపోయింది, వెళతాను" అంటూ శేఖరుడు వెను దిరిగాడు. "అదేమిటి? మా ఇంటికొచ్చి స్నానం చేసి బట్టలు మార్చుకుని వెళ్ళండి" అన్నాడు శంకరయ్య. "వద్దండి! ఇదే అవతారంతో నేను మా గ్రామం వెళ్ళాలి" అంటూ శేఖరుడు చక చక వెళ్ళిపోయాడు.

– దాసరి వెంకటరమణ
m : 90005725733

కథ



# సమయస్ఫూర్తి

దుర్గాపురం అనే ఊరిలో అశ్విన్ అని పిల్లాడు ఉండేవాడు. ఓ రోజు అశ్విన్ని వాళ్ళ నాన్న పిలిచి పక్క ఊరిలో ఉండే తన స్నేహితుడి ఇంటికి వెళ్ళమని... అతడో చిన్న పెట్టె ఇస్తాడనీ దాన్ని జాగ్రత్తగా తీసుకురావాలనీ చెప్పాడు. దాంతో అశ్విన్ తండ్రి చెప్పిన గుర్తుల ప్రకారం పక్క ఊళ్ళో ఉండే ఆ స్నేహితుడి ఇంటికి వెళ్ళాడు. ఇంటికి జాగ్రత్తగా చేరాడు. ఆయన కొన్ని వస్తువులున్న పెట్టెను అశ్విన్ చేతికి ఇస్తూ... 'దార్లో దొంగలు ఉంటారు. ఇంటికి జాగ్రత్తగా తీసుకెళ్ళు' అని చెప్పాడు.

ఇంటికి వచ్చే క్రమంలో అశ్విన్‌కి తన వెనకాల ఎవరో వస్తున్నట్లుగా అడుగుల చప్పుడు వినిపించింది. ఎవరో దొంగ తనని వెంబడిస్తున్నాడని తెలుసుకున్నాడు. దాంతో భయపడుతూనే కాస్త వేగంగా నడవడం మొదలుపెట్టాడు. ఆ అడుగుల చప్పుడు వేగం కూడా పెరిగేసరికి... అశ్విన్‌కి ఏం చేయాలో పాలుపోలేదు. కొంతదూరం వెళ్ళేసరికి అశ్విన్‌కి ఓ నది కనిపించింది. దాన్ని చూడగానే అతడికి ఓ ఆలోచన వచ్చింది.

వెంటనే నదికి కాస్త పక్కగా ఉన్న పొదల్లోకి తన దగ్గరున్న పెట్టెను విసిరేసి, నది ఒడ్డున నిలబడి... 'నా పెట్టె నీళ్ళలో పడిపోయింది..' అంటూ గట్టిగా ఏడవడం మొదలుపెట్టాడు. అశ్విన్ వెనకాలే వస్తున్న దొంగ ఎలాగైనా పెట్టెను తీసుకోవాలనే ఉద్దేశంతో తాను తీసిస్తానంటూ నదిలోకి దూకి వెతకడం ప్రారంభించాడు. అదే అదను అనుకున్న అశ్విన్... పొదల్లోకి విసిరిన పెట్టెను తీసుకుని గబగబా అక్కడి నుంచి వెళ్ళిపోయాడు.

సి. హెచ్. ప్రేరణ
9వ తరగతి
విజయ్ ఉన్నత పాఠశాల, నిజామాబాద్.

ఒలింపిక్స్

# ఒలింపిక్స్‌లో చరిత్ర సృష్టించిన భారత్ షూటర్

# మను భాకర్









ఒలింపిక్స్ 2024లో భారత్ బోణీ కొట్టింది. పోటీల రెండో రోజు.. భారత షూటర్ మను భాకర్ కాంస్య పతకం సాధించింది. ఉమెన్స్ పది మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో మనూ భాకర్ పతకాన్ని గెలుపొందింది. ఈ ఒలింపిక్స్‌లో భారత్‌కు ఇదే తొలి పతకం. అంతే కాదు.. ఒలింపిక్స్ చరిత్రలో పతకం సాధించిన తొలి భారత మహిళా షూటర్‌గా మనూ రికార్డ్ క్రియేట్ చేసింది. కొరియా అమ్మాయి ఓయెజిన్ స్వర్ణం సాధించగా.. ఆ దేశానికే చెందిన కిమ్ యెజీ రజతం సొంతం చేసుకుంది. భారత యువ షూటర్ మను భాకర్ 10 మీటర్ల ఎయిర్‌పిస్టల్ మహిళా విభాగంలో 221.7 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని సాధించింది. ఈ పతకంతో 22 ఏళ్ల మను భాకర్ చరిత్ర సృష్టించింది. 2020 ఒలింపిక్స్‌లో భారీ అంచనాల మధ్య మూడు విభాగాల్లో పోటీ పడిన మను భాకర్ విఫలమైంది. కానీ ఈసారి పోటీపడ్డ తొలి ఈవెంట్ లోనే కాంస్య పతకాన్ని సాధించి సత్తా చాటింది. మను ఈ ఒలింపిక్స్‌లో 10 మీ. ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ విభాగంలో మరో కాంస్యం సాధించింది. మను భాకర్ ఇప్పటికే తొమ్మిది సార్లు వరల్డ్ కప్ మెడల్స్ సాధించింది. షూటింగ్ విభాగంలో ఒలింపిక్ పతకం సాధించిన ఐదో భారత వ్యక్తిగా మను రికార్డుల్లోకి ఎక్కింది. క్వాలిఫికేషన్లో మను భాకర్ అత్యధికంగా 27సార్లు పర్ఫెక్ట్ స్కోర్లు నమోదు చేయడం గమనార్హం. వ్యక్తిగత విభాగంలో గత 20 ఏళ్లలో ఒలింపిక్ ఫైనల్ చేరిన తొలి భారత అథ్లెట్‌గా మను భాకర్ రికార్డు క్రియేట్ చేసింది. 2004లో జరిగిన ఏథెన్స్ ఒలింపిక్స్‌లో పది మీటర్ల ఎయిర్ రైఫిల్ విభాగంలో ఫైనల్ చేరింది.

**ఒలింపిక్స్ పతకాలు సాధించిన భారత షూటర్లు..**

(1) రాజ్యవర్ధన్ రాథోడ్ – మెన్స్ డబుల్ ట్రాప్ – 2000 ఏథెన్స్ ఒలింపిక్స్ – **రజతం.** (2) అభినవ్ బింద్రా – 10 మీ. ఎయిర్ రైఫిల్ – 2008 బీజింగ్ – **స్వర్ణం.** (3) గగన్ నారంగ్ – 10 మీ. ఎయిర్ రైఫిల్ – 2012 లండన్ – **కాంస్యం.** (4) విజయ్ కుమార్ – మెన్స్ 25 మీ. రాపిడ్ ఫైర్ పిస్టల్ – 2012 లండన్ – **రజతం.** (5) మను భాకర్ – ఉమెన్స్ 10 మీ. ఎయిర్ పిస్టల్ – 2024 పారిస్ – **కాంస్యం.** (6) మను భాకర్ – సరబ్‌జోత్ సింగ్ – 10 మీ. ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ – 2024 పారిస్ – **కాంస్యం.**


– సచిన్ కోత్వాల్
బాలచెలిమి డెస్క్, m : 8686664949

నాటిక

# తన దాకా వస్తే



### 1వ దృశ్యం

రాజు : సంపాదించాలి... బాగా సంపాదించాలి అవునూ... మా కుటుంబం అంతా సుఖంగా వుండేట్లు ఎక్కువ డబ్బులు సంపాదించాలి! నా ఒక్కగానొక్క కొడుకు కోసం... ఏమైనా చేస్తా! కానీ డబ్బులు మాత్రం పోగేస్తా!... తొందరగా ఎదగా లంటే.... అడ్డదారి అయినా ఫర్వాలేదు.... కానీ..... ఎట్లా..... ఏం చేయాలి....?

భాస్కర్ : ఏమిట్రా, రాజూ అంత పరేషాన్గా వున్నావ్.

రాజు : ఏం లేదురా భాస్కర్, తొందరగా బాగా డబ్బులు సంపాదించాలంటే ఎట్లా.. అని ఆలోచిస్తున్నా, ఇంతలో నువ్వు కల్సినవ్! ఈ మధ్య బాగా జల్సాగా తిరుగుతున్నా వంటా, ఖర్చులు బాగా పెడ్తున్నావంట, అన్ని డబ్బులు నీకు ఎట్లా వస్తున్నాయి!



భాస్కర్ : అరే, ఇది సీక్రెట్! దగ్గరికి రా! నిన్ను ఒక చోటుకు తీసుకుపోతా ఆయన చెప్పినట్టు చేస్తే చాలు నీకు డబ్బులే డబ్బులు..

రాజు : అట్లనా, సరే నడూ!

(ఇద్దరు కలిసి వెళ్ళి ఒకతన్ని కలుస్తారు)

### 2వ దృశ్యం

భాస్కర్ : ఇదిగో, ఈయనే పీటర్స్! జానాభాయ్! వీడు మా ఫ్రెండు రాజు! బాగా కష్టాల్లో వున్నాడు! డబ్బులు బాగా కావాలంట... నువ్వు నాకు దారి చూపించినట్టు వీడికి ఒకదారి చూపించూ..

పీటర్ : సరే, ఇగో రాజు భాయ్, నా దగ్గర ఈ పొడి వున్నది. దీన్ని పేరున్న స్కూళ్ళ దగ్గరకి వెళ్ళి అక్కడ చదివే పిల్లలకు అందజేయి అంతే.... ఈ పని చేసినందుకు నీకు వేల రూపాయలు నేనిస్తా....

రాజు : కొంపదీసి యిది డ్రగ్స్ కాదు కదా!

పీటర్ : అవునూ! డ్రగ్సే!

రాజు : అయ్యో! తప్పు కదా! చిన్న పిల్లలకు ఇది ఇవ్వడం నేరం కదా!

భాస్కర్ : చూడు రాజూ! తప్పూ ఒప్పు అంటే డబ్బులెట్ల సంపాదిస్తవ్? నా మాట విని ఈ పనికి ఒప్పుకో సంవత్సరం తిరిగేసరికి లక్షాధికారిని అవుతావ్...

రాజు : అంతే, అంటవా! సరే యివ్వు!

పీటర్ : జాగ్రత్త! ఎవరూ లేని సమయంలో స్కూల్ పిల్లలను దగ్గరకు పిలిచి దీన్ని ఒకరిద్దరికి యివ్వు! తర్వాత వాళ్ళు, వాళ్ళ ఫ్రెండ్సుకు ఇచ్చుకుంటారు.... ముందు రెండు రోజులు పాటు ఫ్రీగా యివ్వు తర్వాత డబ్బులు తీసుకో!

రాజు : సరే...! ఇదిగో పిల్లలు... ఇటు రండ్రి! ఈ పొడి తీసుకు పొండి!



### 3వ దృశ్యం

రాజుభార్య: ఏమండీ! చాలా రోజుల నుండి అడుగు దామనుకుంటున్నా మీరు ఈ మధ్య ఇన్ని పైసల్ ఎలా సంపాదిస్తున్నారు?

రాజు : నీకు అవన్నీ అవసరం లేదు! మీ కోసం ఏదో చేస్తున్నా, ఇంట్లోకి అన్ని వస్తువులు తెస్తున్ననా లేదా? ఇంతకీ మన బాబు ఏం చేస్తున్నాడు?

భార్య : సరే! నాకెందుకు గానీ, మీకు కొన్ని రోజుల నుండి ఒక మాట చెప్తామని అనుకుంటున్న. కానీ మర్చిపోతున్నా...

రాజు : ఏమిటే అది.

భార్య : మన బాబు తన 9వ తరగతి ఫ్రెండ్స్‌తో పాట ఎవరో పెద్ద వాళ్ళతో తిరుగు తున్నాడట. సరిగ్గా చదవటం లేదు. ఎప్పుడు చూసినా రూంలో తలుపు పెట్టుకొని వుంటున్నాడు. ఎవరితోనూ మాట్లాడటం లేదు పిచ్చి పిచ్చిగా చేస్తున్నాడు. ఇంట్ల నుండి డబ్బులు ఎత్తుకు పోతున్నట్లు అనిపిస్తుంది.

రాజు : అట్లనా! వాడెక్కడ?

భార్య : స్కూల్కు వెళ్ళిండు... కానీ స్కూల్కు కూడా రోజూ రావడం లేదని వాళ్ళ టీచర్ మొన్న ఫోన్ చేసింది.

రాజు : సరే! నేను వెళ్ళి చూసి వస్తా! (కొద్ది దూరం వెళ్ళిన తరువాత)

### 4వ దృశ్యం

రాజు : అరే.... వాడు మా బాబు మహేశ్... వాడితో ఆ ఇద్దరు పెద్ద పిల్లలు ఎవరు..? అయినా ఈ సందులో ఏం చేస్తున్నారబ్బా..?

మహేశ్ : అరే మామ! మస్తుగున్నది – మత్తుగున్నది ఇంకా యివ్వరా... గిరి : ఛల్... ఇంకా ఎక్కువ పైసల్ తే... పో....

మహేశ్ : అరే, మొన్ననే యింట్ల దొంగతనం చేసి వెయ్యి రూపాయలు ఇచ్చిన గదరా.

నాటిక

అరుణ్ : అవి అప్పుడే అయిపోయినయ్.... ఇంకా నీకు డ్రగ్స్ కావాలంటే యింకా 2000/- రూపాయలు తే.... పో....

మహేష్ : అరేయ్! మా నాన్న కొడ్తాడ్రా!

శేఖర్ : హ..... హ..... హ..... హ..... హ..... ఈ డ్రగ్స్ మాకు అమ్ముతున్నది మీ నాన్న నేరా!

మహేశ్ : ఆ... అయ్యో! అదిగో మా నాన్న, ఇటే.. వస్తున్నారు... పారిపోదాం రండిరా...

(అందరూ పిల్లలు పారిపోతారు. రాజు కింద బాధగా కూలవడిపోతాడు)

రాజు : అయ్యో! ఎంత పనైంది! నా కొడుకును నేనే చెడగొట్టుకుంటినా. నాకు తగిన శాస్త్రి జరిగింది. ఇకముందు డ్రగ్స్ అమ్మను.... ఎవరినీ అమ్మనివ్వను నా కొడుకును బాగు చేసుకోవాలి వస్తా....!



(జనాభా విద్యలో భాగంగా ఎస్సీఇఆరి వారి రోల్ ప్లే నాటిక పోటీల్లో జిల్లా స్థాయి బహుమతిని ఈ నాటిక సాధించింది.)

- డా॥ కాసర్ల నరేశ్‌రావు
m : 94414 06252

బొమ్మలు : కైరంకొండ బాబు

శతకం


# వేమన పద్యాలు

**ఉప్పు కప్పురంబు నొక్క పోలికనుండుఁ**
**జూడఁ జూడ రుచుల జాడ వేఱు**
**పురుషులందు పుణ్య పురుషులు వేఱయా**
**విశ్వదాభిరామ వినురవేమ!**

ఉప్పు, కర్పూరం చూడటానికి ఒకేలా కనిపిస్తాయి, కాని వాటి రుచులు వేరు. అలాగే మనుషులంతా ఒకే విధంగా కనిపించిన అందులో మంచి వారు వేరు.

**రాతిబొమ్మ కేల రంగైన వలువలు**
**గుళ్లు గోపురములు కుంభములును**
**కూడు గుడ్డ తాను గోరునా దైవంబు**
**విశ్వదాభిరామ వినురవేమ**

రాతి బొమ్మలకు వస్త్రాలు, గుడులు, గోపురాలు, నైవేద్యాలు అవసరం లేదు. కూడు, గుడ్డ దేవుడు ఏమీ కోరుకోడు. అవన్నీ మనం కల్పించినవే...!





# శ్రావణ మాసం

శాలివాహన శక కాల పరిగణనలో శ్రావణ మాసం సంవత్సరంలో అయిదవ నెల. శ్రావణ నక్షత్ర కాంతి పరిధిలో సూర్యచంద్రులు తిరుగుతూ ఉంటారు. కనుక ఈ నెలకు శ్రవణ నక్షత్రం పేరు మీద 'శ్రావణ మాసం' అని పేరు వచ్చింది.

శ్రావణ మాసం ఎంతో శోభాయమానమైన నెల. వేసవి వెళ్ళి వాతావరణం చల్లబడుతుంది. శూన్య మాసమైన ఆషాఢం గడిచి పోతుంది. వాతావరణం కొత్త వెలుగులను నింపుకుంటుంది. వానలు కురిసి నేలంతా పచ్చబడుతుంది. వ్యవసాయ పనులు ముమ్మరంగా జరుగుతుంటాయి. చాలా వరకు పూర్తవుతూ ఉంటాయి. పువ్వులూ, కాయలూ పుష్కలమవుతూ ఉంటాయి.

వాన వల్ల అంతా జలమయం అవుతుంది. చలి మొదలు కావటం వల్ల అంతా మందంగా ఉంటుంది. కనుక, ఆరోగ్యాన్ని కాపాడుకోవటం ముఖ్యం.

అందుచేత భోజన వ్యవహారాల పట్ల చాలా మితంగా ఉండాలనేది ఈ నెల నుండి పాటించే ఆచార సంప్రదాయాల ఉద్దేశం.

– 'బాల కథా సౌరభం' నుండి...

## కవిత




అక్షరాలు లేకుంటే
అజ్ఞానం తొలగేనా!
గురుదేవులు లేకుంటే
విజ్ఞానం పెరిగేనా!

పుస్తకాలు లేకుంటే
మస్తకాలు వెలిగేనా!
కన్నవారు లేకుంటే
మన జన్మ సాధ్యమేనా!

స్నేహితులే లేకుంటే
చెలిమి విలువ తెలిసేనా!
చిన్నారులు లేకుంటే
గృహం కళకళలాడేనా!

మహిళామణులు లేకుంటే
ఇంట వెలుగు నిండేనా!
తల్లిదండ్రులు లేకుంటే
ప్రేమ సుమం విరిసేనా!

వృక్షాలే లేకుంటే
స్వచ్ఛ వాయువు దొరికేనా!
పచ్చదనం లేకుంటే
కనువిందే జరిగేనా!

రైతన్నలు లేకుంటే
కడుపుకు కూడు పుట్టేనా!
సైనికులే లేకుంటే
దేశ భద్రత ఉండేనా!

– గద్వాల సోమన్న
ఎమ్మిగనూరు, కర్నూలు
m : 9966414580

## పంచతంత్ర కథలు

# పిచ్చుక కుందేలు కథ



పూర్వం ఒక అడవిలోని చెట్టు తొర్రలో ఒక పిచ్చుక నివసించేది. ఆ పిచ్చుక కొన్నాళ్ళు ఆ తొర్రలో ఉండి ఎక్కడికో ఎగిరిపోయింది. చాలా రోజులు ఆ తొర్ర ఖాళీగా ఉంది. కొన్ని రోజులకు ఒక కుందేలు వచ్చి ఆ తొర్రలో నివాసం ఏర్పాటు చేసుకుంది. ఒక రోజు ఆ పిచ్చుక తిరిగివచ్చి ఆ తొర్రలో ఉన్న కుందేలుని చూచి ఆ తొర్ర తనదని, వెంటనే ఖాళీ చెయ్యమని అడిగింది. ఖాళీ చెయ్యనని కుందేలు మొండికేసింది. ఇలా వారిద్దరి మధ్య వివాదం సాగింది. చివరకు ఆ రెండూ కలిసి ఇంకొకరిని న్యాయం అడుగుదాం అనుకుని బయలుదేరాయి. వాటికి దారిలో ఒక పిల్లి కనిపించింది. ఆ పిల్లి ఒక చెరువు గట్టున ఒంటికి బూడిద పూసుకుని, మునిలాగా నిలబడి, “ఈ జీవితం నీటి బుడగలాంటిది. ఇది శాశ్వతం కాదు. చివరకు నిలిచేది మనం చేసుకున్న పుణ్యం ఒక్కటే” అని ధర్మపన్నాలు పలుకుతోంది. ఆ పిల్లిని చూసి పిచ్చుక, కుందేలు సరైన చోటికి వచ్చామని, చాలా సంతోషించాయి పిల్లి దగ్గరకు వెళ్ళి న్యాయం చెప్పమని కోరాయి. ఎవరిది దోషమైతే వారిని తినవచ్చని ఆ పిల్లితో చెప్పాయి. కానీ పిల్లి అంటే ఉన్న సహజమైన భయంతో కొద్దిగా దూరంగా నిలబడి మాట్లాడసాగాయి. ఆ మాటలు విన్న పిల్లి, “శివశివా! నేను మాంసం తినడం మానేశాను. ముసలిదాన్ని అయిపోయాను. నాకు చెముడు కూడా వచ్చింది. కొంచెం దగ్గరగా వచ్చి చెవిలో చెపితే వింటాను” అని అంది. పిచ్చుక, కుందేలు దాని మాటలకు మోసపోయి, మరింత దగ్గరగా వెళ్ళాయి. అవి దగ్గరు రాగానే వాటిని రెంటినీ పట్టుకుని చంపి, తినివేసింది.

**నీతి : దుర్మార్గుడికి న్యాయం, ధర్మం ఉండవు.**

చెట్టు - చేమ

# చింత చెట్టు




హోయ్ బాలలూ.. బాగున్నారా! గత నెల బాల చెలిమి సంచికలో వేప చెట్టు గురించి తెలుసుకున్నాం కదా. ఈ ఆగస్టు సంచికలో చింత చెట్టు గురించి తెలుసుకుందాం.


"భారతదేశ ఖర్జూరం" అని పిలవబడే చింత చెట్టు శాస్త్రీయ నామం 'టామెండరీస్ ఇండికా'. ఈ చెట్టు రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు భారతదేశంలో సాధారణంగా కనిపించే భారీ వృక్షం. దీని ఆకులు, కాయలు, పండ్లు, ప్రపంచవ్యాప్తంగా అనేక వంటకాలలో విరివిగా వాడుతారు. సుమారు 20 మీటర్ల నుండి 30 మీటర్ల ఎత్తు వరకు పెరిగే చింత చెట్టు జీవిత కాలం దాదాపు 200 సంవత్సరాలు. పూర్వకాలంలో కూడా రాజులు సహితం రోడ్ల కిరుపక్కల నాటించడం వల్ల చింత చెట్లు విరివిగా కనిపించేవి. కానీ రాను రాను ఈ చెట్లు కనుమరుగవుతున్నాయి. ఈ చెట్ల వల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయి. మనము రోజూ వాడే పచ్చి పులుసు, కూరలు, చారు, సాంబారు వంటి వాటిని చింతపండుతో తయారు చేస్తారు. చింతపండును ఉపయోగించి చేసే వంటలు చాలా రుచికరంగా ఉంటాయి. చింతపండును వాడడం ఆరోగ్యానికి ఎంతో మంచిది. ఫ్లోరోసిస్ వ్యాధిని కూడా అరికడుతుంది. చింత గింజలు బెరడు ఎన్నో ఔషధ గుణాలు కలిగి ఉంటాయి. ఎప్పుడైనా దెబ్బ తగిలినప్పుడు బెనకడం, వాపు వచ్చినప్పుడు ఈ చెట్టు ఆకుతో కాపడం వల్ల తగ్గుతుంది. ఆకుల రసాన్ని కషాయంతో తాగితే రక్తం శుద్ధి అవుతుంది. ఊపిరితిత్తుల్లో పేరుకుపోయిన కఫం, శ్లేష్మం తొలగిపోతాయి. గుండె ఆరోగ్యంగా కూడా పనిచేస్తుంది. చింతకాయలతో ఊరగాయ పచ్చడి పెడతారు. ఈ పచ్చడిని సంవత్సరం పాటు నిల్వ ఉంచుకోవచ్చు. కాయలు పిందెలుగా ఉన్నప్పుడు ఉన్న కాయల పచ్చడి కూడా చేస్తారు. వేడి వేడి అన్నంలో భలే రుచిగా ఉంటుంది. ఉడుకు ఉడుకు అన్నంలో చింతకాయ పచ్చడితో కలిపి పెట్టడం వల్ల చిన్న పిల్లలు ఇష్టంగా తింటారు. చింత చిగురులో పప్పు కానీ, వొట్టి చేపలు కానీ, చికెన్ గానీ కలిపి వండుకుంటే భలే రుచిగా ఉంటుంది. ఎండా కాలంలో చింత చెట్లు పశుపక్షాదులకు నీడలుగా, నివాసాలుగా ఉపయోగపడతాయి. ఈ చెట్లు నీటి ఎద్దడిని తట్టుకొని బతుకుతాయి. లావైన కాండం కలిగి కొమ్మలు చాలా బలిష్టంగా ఉండి ఎటువంటి గాలి వానకైనా తట్టుకుని నిలబడగలుగుతుంది. దీన్ని కలపతో వ్యవసాయ పనిముట్లు కూడా చేస్తారు. చింతపండును ఉపయోగించడం వల్ల శరీరానికి "సి విటమిన్" పుష్కలంగా దొరుకుతుంది. చింతపండులో ఉండే పిక్కను చిన్నపిల్లల ముడ్డి దగ్గర పెడితే మోషన్ ఫ్రీ అవుతుంది. చింత గింజలతో వామన గుంటలు, అష్టా చమ్మ, దాడి వంటి అనేక ఆటలు ఆడుతారు. ఆ గింజలను వేపుడు చేసి తింటే ఎంతో మంచిది. తేలు కరిసిన చోట చింతగింజను రాసి గంధం పెడితే వెంటనే మంట తగ్గుతుంది. ఈ చింత చెట్లు మన దేశంతో పాటు ఆఫ్రికా, తూర్పు ఆసియా మరియు అమెరికాలో సాధారణంగా పెరుగుతాయి. ఇన్ని ఉపయోగాలు కలిగి ఉన్న చింత చెట్లు నేడు మన సమాజంలో తగ్గిపోవడం విచారకరం. అందుకే విద్యార్థులారా పర్యావరణం కాపాడే దిశగా మనమంతా పాఠశాలలో, గ్రామాలలో, చింత చెట్లను విరివిగా నాటుదాం.


– కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి
m : 9441561655

# తగినమందు

రచన : చొక్కాపు వెంకటరమణ, m : 9246520050
బొమ్మలు : టి. గంగాధర్, m :7702037198
మార్చ్ 1991, బాలచెలిమి మాసపత్రిక నుండి...




మళ్ళీ శీనుని డాక్టర్ దగ్గరికి తీసుకెళితే పరీక్షించగా
అసలు కిటుకు డాక్టర్‌కి అర్థమయింది.
మీ వాడి దగ్గుకి సరిపోయే మందు ఇస్తాను
మూడేళ్ళ పిల్లలకైతే పటిక బెల్లం వల్ల దగ్గు తగ్గుతుంది.. ఆరేళ్ళ పిల్లలకు 'కరక్కాయ' సరైన మందు
ప్రతిరోజు కరక్కాయ బుగ్గకింది పెట్టుకోవాలి నాలుగు రోజుల్లో తగ్గిపోతుంది
అలాగే డాక్టర్ గారు వెళ్ళొస్తాము.
సరే...
తండ్రి శీనుకి కరక్కాయ ఇచ్చాడు.
ఇదిగో దీన్ని నీ బుగ్గకింద పెట్టుకోరా!
పటిక బెల్లం పసందుగా ఉంది. ఈ కరక్కాయ వగరుగా ఉంది... తూ! తూ
ఎవరూ చూడకుండా కరక్కాయ బయట పారేశాడు శీను.
ఒక్క రోజులోనే శీనుగాడి దగ్గు పూర్తిగా తగ్గిపోయిందండి
ఆ డాక్టరు వీడి దగ్గుకి తగిన మందు ఇచ్చాడుగా
అబద్ధాలు ఆడకుంటే
బుద్ధి నీకు వికసించును!
నిజం నీవు చెప్పకుంటే
పరిస్థితులు వికటించును!
సమాప్తం




# చీమ-పాప కథ

చీమా చీమా చిట్టి చీమా
ఎందుకు నన్ను కుట్టావు?
పాపా పాపా బుజ్జి పాపా
చూడక నిన్ను కుట్టాను.
సరే సరే చిట్టి చీమ,
నాకో సాయం చెయ్యమ్మ.
ఏమిటో చెప్పు మంచి పాప,
చిటికెలో చేసేస్తానమ్మా
అమ్మ దాచిన మిఠాయి డబ్బా,
ఎక్కడ ఉందో వెదుకమ్మా.
ఇదుగో ఇక్కడ ఉన్నది డబ్బా
మూతను నువ్వే తియ్యమ్మా.
పదా పదా చిట్టి చీమ,
చప్పుడు చేయక తీద్దాము.
నువ్వు నేను ఎంచక్కా
మిఠాయిలన్నీ తిందాము.

– డా. సిరి
మిర్యాలగూడ

# బాల చెలిమి

బాల చెలిమి గొప్ప చెలిమి
బాల లంత మెచ్చు చెలిమి
విజ్ఞానం పంచు చెలిమి
అజ్ఞానం త్రుంచు చెలిమి
కథల సృజన చెప్పు చెలిమి
గేయ సృష్టి నేర్పు చెలిమి
ఆలోచన నేర్పు చెలిమి
మంచి బాట చూపు చెలిమి
బాల చెలిమి భలే చెలిమి
భవ్య భవిత నిచ్చు చెలిమి

– బెలగాం భీమేశ్వరరావు
9989537835

# అక్షరాల పాటలు



అ ఆ, ఇ ఈ
అటక మీద పిల్లి
ఉ ఊ, ఎ ఏ
ఎలుకను మింగే?
గుటుక్కు మింగే!



దీర్ఘాలు

కా కా కా కాకమ్మ!
రా రా రా రావమ్మ!
పా పా పా పాడమ్మ!
ఆ ఆ ఆ చాలమ్మ!
టా టా టా పోవమ్మ!



– పిల్లల పాటల పరిమళం
తెలంగాణ సారస్వత పరిషత్తు

## కథ






# వెండి చేప పిల్ల కథ

అనగనగా ఓ కొండ పక్కనున్న సరస్సులో ఓ వెండి చేప పిల్ల నివసించేది. అదే సరస్సులో ఎర్రటి ముక్కున్న, తెల్లటి రాజ హంస కూడా నివసించేది. ఓ రోజు హంసకు, వెండి చేప పిల్ల తారసపడింది. హంస దాన్ని తినేద్దామనుకుంది.

వెండి చేప పిల్ల ఇలా ప్రార్థించసాగింది “రాజ హంస గారూ! రాజహంస గారూ!! దయచేసి నన్ను చంపొద్దు, నా ప్రాణాలు కాపాడండి”.

రాజహంస ఇలా అంది “సరే! నిన్ను నేను వదిలేస్తాను. ఈ సరస్సు పైనున్న మంచు వల్ల నా కాళ్ళు చాలా ఇబ్బంది పడుతున్నాయి. నాకో చక్కని ‘బూట్ల’ జతని సంపాదించు. బూట్లు లేకుండా తిరిగి వచ్చావో, నీ పని అయిపోయినట్లే”.

వెండి చేపపిల్ల సరస్సు అంతా గాలించింది. చివరికి సరస్సు అడుగున కూడా వెతికింది. ఎంత వెతికినా బూట్ల జత మాత్రం కనిపించలేదు. నిరాశ చెందింది. చివరకు సరస్సు ఒడ్డు దగ్గరున్న రెల్లు గడ్డి పొదల వద్దకు చేరింది. బిగ్గరగా ఏడ్వసాగింది.



చేపపిల్ల ఏడుపుని ఓ ఆకుపచ్చని కప్ప విన్నది.

"ఓ వెండి చేప పిల్లా! వెండిచేప పిల్లా! ఎందుకు ఏడుస్తున్నావ్? ఏం కష్టమొచ్చింది?" అని అడిగింది కప్ప.

వెండి చేపపిల్ల తన కథంతా చెప్పి తన దురదృష్టానికి బాధపడింది.

ఆకుపచ్చ కప్ప ఇలా అంది "నేను నీకు సాయం చేస్తాను. కానీ నువ్వు ఇక్కడే వుండు. నా కోసం ఎదురు చూడు" సరేనంది చేపపిల్ల.

ఆకుపచ్చ కప్ప ఒడ్డుకు బాగా దగ్గరగా వున్న గడ్డి పొదల దగ్గరకు వెళ్ళింది. "బెక్..బెక్..బెక్..బెక్" అని అరవసాగింది.

ఒడ్డు పక్కనున్న విల్లో చెట్టుపై కూర్చుని వున్న ఓ పిచుక, కప్ప అరుపులు వినింది. "క్రిప్.. క్రిప్.. క్రిప్.. క్రిప్" అని పిచుక అరవసాగింది.

"ఆకుపచ్చ కప్పా! ఎందుకు అరుస్తున్నావ్? నీకు ఏ సాయం కావాలి?" అని అడిగింది పిచుక.

కప్ప వెండి చేపపిల్ల కథంతా చెప్పింది. తనకు బూట్ల జత ఎంత అవసరమో వివరించింది.

పిచుక ఇలా అంది "నేను నీకు సాయం చేస్తాను. కానీ నువ్వు ఇక్కడే వుండు. నా కోసం ఎదురుచూడు" సరేనంది ఆకుపచ్చ కప్ప.

పిచుక ఎగురుకుంటూ సరస్సు పక్కనున్న ఓ గ్రామానికి వెళ్ళింది. అక్కడ ఓ ఇంటి పెరడులో ఓ చిన్న పాప ఆడుకుంటుంది. ఆ పాప పేరు నటలోష్కా. "క్రిప్..క్రిప్..క్రిప్..క్రిప్" అని పిచుక అరవసాగింది.

"ఓ బుజ్జి పిచుక! ఎందుకు అరుస్తున్నావ్? నీకు ఏ సాయం కావాలి?" అని అడిగింది పాప.

పిచుక వెండి చేపపిల్ల కథంతా చెప్పింది. చేపపిల్ల బూట్ల జత లేకుండా, రాజహంస వద్దకు వెళ్తే ప్రాణగండం వుందని వివరించింది. సాయం కావాలని అర్థించింది.

చిన్న పాప ఇలా అంది "నేను నీకు సాయం చేస్తాను. కానీ నువ్వు ఇక్కడే వుండు. నా కోసం ఎదురుచూడు". సరేనంది పిచుక.

పాప ఇంట్లోకి వెళ్ళి, తన ఎర్రటి అందమైన బూట్ల జతను తీసుకొచ్చి వాటిని పిచుకకు ఇచ్చింది.

పాప పిచుకతో ఇలా అంది "నువ్వు ఎంత త్వరగా వీలైతే అంత వేగంగా వెళ్ళి, వెండి చేపపిల్ల ప్రాణాలు కాపాడు".

పిచుక కృతజ్ఞతలు తెలిపింది. వాయు వేగంతో ఎగురుతూ ఆకుపచ్చ కప్ప వద్దకు చేరింది. బూట్ల జతను ఇచ్చింది. కప్ప పిచుకకు కృతజ్ఞతలు తెలిపింది. కప్ప ఆ బూట్ల జతను వెండి చేపపిల్లకు అప్పగించింది.

వెండి చేపపిల్ల కప్పకు కృతజ్ఞతలు తెలిపింది. ఎర్రటి అందమైన బూట్ల జతను తీసుకెళ్ళి, రాజహంసకు ఇచ్చింది. అవి హంస పాదాలకు చక్కగా సరిపోయాయి. చేపపిల్ల జోలికి తను జీవితంలో రానని, మాట ఇచ్చింది రాజహంస. ఎంతో ఆనందించింది చేపపిల్ల.

ఈ విషయాన్ని ఆకుపచ్చ కప్పతో చెప్పింది. "నన్ను కాపాడినందుకు కృతజ్ఞతలు నేస్తం" అంది వెండిచేప పిల్ల. కప్ప పిచుక గురించి, చిన్న పాప గురించి చెప్పింది.

వెండి చేపపిల్ల తన కృతజ్ఞతల్ని పిచుకకు, చిన్న పాపకు కూడా చెప్పమని అభ్యర్థించింది. ఆకుపచ్చ కప్ప ఈ విషయాన్ని పిచుకకి చెప్పింది. పిచుక ఈ సంగతిని పాపకు చెప్పింది. పాప ఆనందంతో చిరునవ్వు నవ్వింది.

ఇదండీ నా చిన్నారి నేస్తాలూ! వెండి చేపపిల్ల కథ. మీరు మీ స్నేహితులకు ఇలాంటి సాయం ఏదో చేసే ఉంటారు. ఆ కథ నాకూ చెప్తారు కదూ!

స్వేచ్ఛానువాదం : **అనిల్ బత్తుల**
m : 8179273974

ఇంగ్లీష్ : లిటిల్ నటలోష్కా & ది ఫిష్
రైటర్ : మికోలా ట్రుబ్‌లైని, రష్యన్ జానపద కథలు

సైన్స్

# కాగితపు బొమ్మల కథక్ నృత్యం

ఒక గమ్మత్తు చేయడానికి గాజు గిన్నె, గాజు మూత పలుచని కాగితం ముక్కలు, సిల్కుబట్ట కావాలి. సుమారు నాలుగు సె.మీ. లోతున్న గాజుగిన్నె తీసుకో. గిన్నెలోతు కన్నా కొంచెం చిన్న సైజు (సుమారు 3 సెం.మీ. పొడవున్న ఆడ, మగ మనిషి బొమ్మలు నాలుగు జంటలు–ఈ బొమ్మలో చూపినట్లు – పలుచని కాగితం నుంచి కత్తిరించు. కావాలంటే వీటికి రంగులు వేయవచ్చు. ఈ కాగితపు బొమ్మల్ని ఆ గాజు గిన్నెలో వేసి, గాజు పలక మూత వెయ్యి.

సిల్కు బట్టతో గాజుమూత పై భాగాన రుద్దుతూ ఉంటే, ఈ బొమ్మలు పైకి ఎగిరి, గాజు మూతకు తగులు కొని తమాషాగా ఊగిసలాడుతూ కిందపడిపోతూ, మళ్ళీ లేస్తూ నృత్యం చేస్తాయి. ఈ బొమ్మలు ఇలా ఎందుకు చేస్తాయో తెలిసిందా? సిల్కు బట్టతో రుద్దడం వల్ల గాజు మూత రుణ విద్యుత్తుతో నిండి ఉంటుంది. కింద ఉన్న కాగితపు బొమ్మలు తటస్థమైనవి కాబట్టి ఆకర్షించబడి పైకి ఎగిరి గాజు మూతకి అతుక్కుంటాయి. కొంత సేపటికి సహవాసం వలన ఆ బొమ్మల మీద కూడా రుణవిద్యుత్తు ఏర్పడుతుంది. గాజు మూతమీద బొమ్మల మీద కూడ ఒకే జాతి (రుణ) విద్యుత్తు ఉండడం వలన వికర్షణకు గురి అయ్యి మూతను విడిచి క్రింద పడిపోతాయి. రుద్దుతూ ఉంటే ఇదే చక్రం మళ్ళీ మళ్ళీ కొనసాగుతూ ఉంటుంది.

– డాక్టర్ మహీధర నళినీ మోహన్

ఏప్రిల్ 1991, బాలచెలిమి మాసపత్రిక నుండి



కథ

# మిఠాయి దొరికింది!




పట్నం వీధుల్లో ఒంటరిగా తిరుగుతున్న కోతికి.. ఓ దుకాణం నుంచి 'జారుమిఠాయి' అనే పాట వినిపించింది. ఆ పాట వింటూ... కొంతమంది సరదాగా మాట్లాడుకుంటున్నారు. ఆ పాటలో ఉన్న జారు మిఠాయిని ఎలాగైనా తినాలనే కోరిక పుట్టిందా కోతికి.


ఓ మిఠాయి దుకాణం దగ్గరకు వెళ్లి... "జారు మిఠాయి ఉందా?" అని అడిగింది. లేదని సమాధానమిచ్చాడా దుకాణ యజమాని.

అలా చాలా మిఠాయి కొట్లు తిరిగింది. అన్ని చోట్లా... లేదనే సమాధానవే రావడంతో నిరాశ చెందింది. అలా రోజులు గడుస్తున్నా.. జారు మిఠాయి తినాలనే కోరిక మాత్రం కోతికి తగ్గలేదు. ఒకరోజు గుడి దగ్గర కొబ్బరి ముక్క తింటూ.... ఆలోచిస్తున్న కోతి దగ్గరకు ఓ కాకి వచ్చింది.

"ఏంటి మిత్రమా.. దిగాలుగా కూర్చున్నావు ?" అని ప్రశ్నించింది. "చాలా రోజులుగా జారు మిఠాయి తినాలనే కోరికను చంపుకో లేకపోతున్నాను. ఆ మిఠాయి ఎక్కడ దొరుకుతుందో తెలియడం లేదు. నీకేమైనా తెలుసా?" అని ప్రశ్నించింది కోతి. "నాకెందుకు తెలియదు. నీ చేతిలో ఉన్న కొబ్బరి ముక్క ఇస్తే చెబుతా..." అంది కాకి. క్షణం ఆలస్యం చేయకుండా కొబ్బరిముక్కను ఇచ్చేసింది కోతి.

'అడవికి వెళ్తే నీకు అన్ని రకాల మిఠాయిలు దొరుకుతాయి' అని చెప్పి కొబ్బరి ముక్కను నోట కరుచుకుని ఎగిరిపోయింది కాకి. వెంటనే పెట్టే బేడా సర్దుకొని అడవికి బయలుదేరింది కోతి. ఎప్పుడూ ఒంటరిగా అడవిలోకి వెళ్లక పోవడంతో కాస్త భయంవేసింది కోతికి. దగ్గరలో కనిపించిన ఓ చెట్టు ఎక్కి.. కంగారుగా అటూ ఇటూ చూడసాగింది. కింద ఓ నక్క తననే చూస్తూ కనిపించింది.

'వామ్మో... ఇదేంటి నన్ను ఇలా తినేసేలా చూస్తుంది ?' అని మనసులోనే భయపడింది



కోతి. అడవికి కొత్తగా వచ్చిన కోతిని ఎలాగైనా తినాలని నక్క పన్నాగం పన్నింది. కోతిని పట్టుకోవడం తన వల్ల కాదు కాబట్టి... ఏ సింహానికో, పులికో దాన్ని అప్పగించి అందులో కొంత వాటా అయినా తిందామని అనుకుంది.

"ఓ కోతీ... ఈ అడవిలో నీకు ఏదైనా సహాయం కావాలంటే నన్ను అడుగు. నేను మాత్రమే ఇక్కడ నీకు నమ్మకమైన మిత్రుడిని. నన్ను నమ్మి కిందికి రా.... నీకు అడవి అంతా చూపిస్తాను" అంటూ నమ్మించే ప్రయత్నం చేసింది. "నాకు జారు మిఠాయి కావాలి... తినిపిస్తావా?" అంది కోతి.

'ఓస్... మిఠాయా... నీకు ఎంత కావాలంటే అంత తినిపిస్తాను. ఈ అడవిలో చాలా ఉంది. నువ్వు ముందు కిందికి రా... మిఠాయి దగ్గరకు తీసుకువెళ్తాను' అంది నక్క. దాని మాటలు నమ్మిన కోతి, కిందికి దిగింది. తన పాచిక పారినందుకు సంతోషించిందా జిత్తులమారి.

కోతిని నేరుగా సింహం గుహ దగ్గరకు తీసుకెళ్లింది. "నువ్విక్కడే ఉండు.... ఎక్కడికీ వెళ్లకు" అంటూ కోతిని బయటే ఉంచి గుహ లోపలికి వెళ్లిందా నక్క. ఇదంతా గమనిస్తున్న ఓ ఎలుగుబంటి, కోతి దగ్గరకు వచ్చి..

'కోతీ.. నువ్విక్కడ ఉండటం క్షేమం కాదు. నాతో పాటు వచ్చి నీ ప్రాణం కాపాడుకో... లేకపోతే ఆ సింహం చేతిలో నీ పని అయిపోయినట్లే" అంటూ హెచ్చరించింది. దాంతో కోతికి పై ప్రాణాలు పైనే పోయాయి. భయపడుతున్న కోతిని దగ్గరలో ఉన్న ఓ చెట్టుపైకి తీసుకెళ్లిందది.

ఓ వైపు కోతిని వెతుక్కుంటూ చెట్టు దగ్గరకు చేరాయి సింహం, నక్క "ఏయ్ ఎలుగూ.. మర్యాదగా ఆ కోతిని మాకు అప్పగించు.. లేకపోతే చెట్టు ఎక్కడం నాకు పెద్ద కష్టం కాదు. ఎక్కానంటే ఇద్దరినీ తినేస్తా" అంటూ గర్జించింది. ఎలుగుబంటి నుంచి సమాధానం రాకపోవడంతో సింహం చెట్టు ఎక్కడానికి ప్రయత్నించింది. నక్క మాత్రం కిందనే ఉండి ముసిముసిగా నవ్వుకుంది. కోతి మాంసంతో విందు ఖాయమను కుంటూ సంబరపడింది. ఇంతలో అంతకుముందు రోజు అదే చెట్టుపైన తేనె దాచుకున్న విషయం ఎలుగుబంటికి గుర్తుకు వచ్చింది. అది తీసుకొని, కొంత తేనెను సింహం అరికాళ్లపైన పడేలా పోసింది. ఇంకేముంది. సింహం పట్టు జారి కిందపడింది. ఎన్నిసార్లు చెట్టు ఎక్కే ప్రయత్నం చేసినా... పడుతూనే ఉంది. ఇక లాభం లేదనుకొని సింహం, నక్క నిరాశగా వెనుదిరిగాయి.

కోతి వచ్చింది జారు మిఠాయి కోసమని తెలుసుకున్న ఎలుగుబంటి.. తను దాచుకున్న తేనెను దానికి ఇచ్చేసింది. "భలే తియ్యగా ఉంది. ఇదేనా జారు మిఠాయి" అంటూ ఆబగా తినసాగింది. 'జారు మిఠాయి అంటే ఏంటో తెలియదు కానీ, మా అడవిలో దొరికే జారు మిఠాయి ఇదే..' అంది ఎలుగుబంటి. "నేను కోరుకున్న రుచి దొరికింది. ఈ జారు మిఠాయి భలే తియ్యగా ఉంది.. అంతకంటే మధురమైన స్నేహం నాకు దొరికింది" అంటూ ఎలుగుబంటిని ఆప్యాయంగా దగ్గరకు తీసుకుంది కోతి. ఇక ఏ ప్రమాదం లేదని నిర్ధారించుకున్నాక... ఎలుగుబంటి కోతిని జాగ్రత్తగా అడవి దాటించింది. కోతి తిరిగి పట్నం దారి పట్టింది. నడుం నొప్పితో బాధపడుతున్న సింహానికి సపర్యలు చేయసాగింది నక్క. "మృగరాజా.. జారు మిఠాయి కోసమని మన అడవికి వచ్చిన కోతి తప్పించుకుంది. ఆ మాయదారి ఎలుగుబంటి లేకపోతే... అది మనకు ఆహారమయ్యేది. ఇంతకీ జారుమిఠాయి అంటే ఈ తేనేనా?" అంటూ సందేహం వెలిబుచ్చింది. ఒక వైపు నొప్పితో అల్లాడుతున్న సింహానికి.. నక్క ప్రశ్నలు చిరాకు తెప్పించాయి. కోపంతో దానికి తన పంజా రుచి చూపించింది. 'కుయ్యో.. మొర్రో..' అంటూ పరుగు అందుకుంది నక్క.

– వడ్డేపల్లి వెంకటేష్


పిల్లల జాబిల్లి పుస్తకం నుండి...


m : 9989596554


# ఏమంటావ్

కాకీ... కాకీ... ఏమంటావ్?
కావు... కావు... కావు...
ఆవూ... ఆవూ... ఏమంటావ్?
అంబా... అంబా... అంబా...
పుంజూ... పుంజూ... ఏమంటావ్?
కొక్కొరోకో... కొకొరోకో....
కోకిల... కోకిల... ఏమంటావ్?
కుహూ... కుహూ... కుహూ...
మేకా మేకా ఏమంటావ్?
మే... మే... మే...
పామూ... పామూ.... ఏమంటావ్?
బుస్... బుస్... బుస్....

- ఎం. హరికిషన్
m: 9441032212







# మన ప్రాచీన రాజధాని ఇంద్రపాలనగరం

1956లో మద్రాస్ నుండి విడిపోతున్నప్పుడు, 2014లో తెలంగాణ నుండి విడిపోతున్నప్పుడు ఆంధ్రులు రాజధాని నగరం కోసం కొట్లాడారు. అలాంటి రాజధానుల (చరిత్ర) కొరత తెలంగాణకు లేదు. తెలుగు చరిత్ర పుటలను తిరగవేస్తే తెలంగాణలోనే ఎక్కువ రాజధానులు కన్పిస్తాయి. అలాంటిదొకటి ఇంద్రపాల నగరం. ఇది వేయిన్నర సంవత్సరాల కిందటే కొంత కాలం యావత్ తెలంగాణకు, ఆపై నర్మదా నది వరకు గల దక్కను ప్రాంతానికి కూడా రాజధానిగా ఉండేది. క్రీ.శ.5-6 శతాబ్దాల మధ్య తెలంగాణను పాలించిన విష్ణుకుండి రాజుల మూడు రాజధానుల్లో ఇంద్రపాలనగరం ఒకటి. మొదటి రాజధాని అమరావతి. ఇది మహబూబ్‌నగర్ జిల్లాలోని అమ్రాబాద్ మండల కేంద్రం. రెండవ రాజధాని హైదరాబాద్ శివారులోని కీసరగుట్ట. నాలుగు దశాబ్దాల కింద చరిత్రకారులు కీ.శే.బి.ఎన్.శాస్త్రిగారు ఇక్కడి సమీప గ్రామంలో విష్ణుకుండి రాజుల రాగి శాసనాలను సేకరించి, వాటిలోని వివరాలను ప్రచురించి ఇంద్రపాల నగరాన్ని వెలుగులోకి తెచ్చారు. ఈ నగరం విష్ణుకుండుల తరువాత కూడా రాష్ట్రకూట రాజులు, చాళుక్య రాజులకు కూడా ఒక ప్రాంతీయ రాజధానిగా వర్ధిల్లిందనే చారిత్రక ఆధారాలు ఉన్నాయక్కడ. నల్గొండ జిల్లాలోని తుమ్మలగూడెం, వలిగొండ గ్రామాల మధ్య పారుతున్న మూసీనది ఒడ్డును ఆనుకొని ఉన్న ఒక విశాలమైన గుట్ట మీద, దాన్ని ఆనుకొని ఉన్న పరిసరాల్లో ఆనాటి ఇంద్రపాలనగరం ఉండేది. గుట్ట మీదనే పది పన్నెండు బురుజులతో కూడిన కోటగోడలు, శివాలయం, లక్ష్మీనరసింహాలయం, ఎల్లమ్మగుడి, వాటి పరిసరాల్లో కోనేర్లు, అత్యున్నత స్థానంలో రాజమందిరపు పునాదుల ఆనవాళ్ళు, ఏటవాలులో బౌద్ధ విహారాలు (మహాదేవి విహారం), ఆరామాలు, మరో శివాలయం, జైన మునుల శిల్పాలు, గుహాలయాలు మొదలైనవి నేటికీ దర్శనమిస్తాయి. శంకర్ అనే ఒక మాల పూజారి తనను శివుడు ఆదేశించాడని వీటిని సంరక్షిస్తుండడం అభినందనీయమైన విషయం, మేధావులు సిగ్గుపడవలసిన విషయం. గుట్ట నుండి మూసీనదికి శిలా సోపానాలున్నాయి. మూసీనది ఆంగ్ల అక్షరం 'ఎస్' ఆకారంలో ప్రవహిస్తూ ఏర్పరచిన ఒక ద్వీపాకారపు గుట్టబోరు మీద చిన్న చిన్న శివలింగాలు 108 చెక్కి ఉన్నాయి. మరో పక్క గంగమ్మ గుడి ఉంది. గుట్టకు మరోవైపు పారుతున్న మహబూబ్‌నహర్ కాలువ వైపు వేంకటేశ్వరాలయం, 40 స్తంభాల మంటపంతో కూడిన పంచ కూటాలయం, ముత్యాలమ్మవారి గుడి, కోనేర్లు, శిథిల శిల్పాలు, శాసనాలు మరెన్నో ఉన్నాయి. వీటన్నింటిని దర్శించి మన గత చరిత్రను చూసి గర్వించడమే కాకుండా ఆయా విశేషాలను శాస్త్రీయంగా డాక్యుమెంట్ చేసి వాటిని పరిరక్షించుకోవలసిన అవసరముంది. ఇంద్రపాలనగరానికి సమీపంలో సమకాలీన చారిత్రక ఆలయాలున్న వలిగొండ, మత్స్యగిరిలను కూడా ఆసక్తిగలవారు దర్శించవచ్చు.

ఇలా వెళ్ళాలి: ఇంద్రపాలనగరం హైదరాబాద్ నుండి ఎనభై కిలోమీటర్ల దూరంలో ఉంది. హైదరాబాద్ నుండి పోవాలనుకున్నవారు వరంగల్ రహదారిలో వచ్చే భువనగిరి నుండి కుడివైపున వచ్చే వలిగొండ మీదుగా చేరుకోవచ్చు. విజయవాడ రహదారిలో ప్రయాణించేవారు చౌటుప్పల్ నుండి ఎడమవైపున వచ్చే తుమ్మలగూడెం మీదుగా చేరుకోవచ్చు. రైలులో ప్రయాణించాలనుకొన్నా తుమ్మలగూడెంలోనే దిగాలి. సొంత వాహనాలు లేనివారు తుమ్మలగూడెం నుండి రెండు కిలోమీటర్ల దూరం ఆటోలోగాని, నడిచిగాని చేరుకోవచ్చు.

– డా. ద్యావనపల్లి సత్యనారాయణ
m : 94909 57078

బాలచెలిమి క్లబ్

## చెలిమి క్లబ్

చెలిమిక్లబ్‌లో సభ్యత్వం తీసుకోండి
లాభాలు పొందండి.

1. చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ ప్రచురించే పుస్తకాలపై ప్రత్యేక తగ్గింపు.
2. మీ ప్రతి పుట్టిన రోజుకు అభినందనలతో అందమైన గ్రీటింగ్ కార్డు.
3. మీలో ఉన్న టాలెంట్‌ను అభివృద్ధి చేసుకోవడానికి క్లబ్ నిర్మాణాత్మక సహకారం అందిస్తుంది.
4. మీ స్కూల్లో, ఊర్లో పిల్లల కార్యక్రమాల వార్తలను చెలిమి సమాచారపత్రికకు పంపడానికి మీరు విలేఖరిగా ఉండవచ్చు.
5. అందమైన మెంబర్‌షిప్ బ్యాడ్జి.
6. మిమ్మల్ని ఆశ్చర్యపరచే బహుమతులు.



### చెలిమి క్లబ్

మెంబర్ షిప్ నెం. : ---------------

పేరు : ----------------------

తండ్రి పేరు : ----------------------

తరగతి : ----------------------

పుట్టినతేదీ : ----------------------

హాబీలు : ----------------------

చిరునామా : ----------------------

----------------------

----------------------

పిన్ : ----------------------

ఇ-మెయిల్ : ----------------------

ఈ వివరాలతో మెయిల్ చేయండి.

బాల చెలిమి ఇ-మెయిల్ :
desk.chelimi@gmail.com



కథ

# రోహన్ చంద్రయాన్ యాత్ర




నా పేరు రోహన్. నాకు ఐదేళ్ళు. నేను స్కూల్లో ఫస్ట్ క్లాస్ చదువుతున్నాను. నాకు కథలంటే చాలా ఇష్టం. ప్రతిరోజూ పడుకునే ముందు మా మమ్మీ డాడీ ఎవరో ఒకరు నాకు కథ చెప్తేనే పడుకుంటాను.

నేను అలా బోలెడు కథలు చెప్పించుకొని విన్నాను. ఈ రోజు అమ్మానాన్నా తమకు కథలేవీ గుర్తుకు రావడం లేదన్నారు. "సరే, ఐతే నేనే ఇప్పుడు కథ చెప్తాను వినండి!" అని నేనే వాళ్ళకు ఓ కథ చెప్పడం మొదలు పెట్టాను. "ఒకరోజు మేం మా ఫ్రెండ్స్‌తో కలిసి ఆడుకుంటున్నాం. అందరం కలిసి రైల్లో కూచున్నాం. నేనే ఆ రైలు నడిపిస్తున్నాను. మా ఫ్రెండ్స్ రడీ అనగానే మా రైలు జుయ్యుమని స్కైలోకి ఎగిరిపోయింది."

"రైలు స్కైలోకి ఎగిరిపోవడం ఏమిట్రా? రైలు భూమ్మీదనే వెళ్తుంది." నా కథ వింటున్న డాడీ అన్నాడు.

కథను ఇలా మధ్యలో అలా ఆపి ప్రశ్నించడం నాకు నచ్చలేదు. చిరాగ్గా మొహంపెట్టి "ఇది నా కథ, నా ఇష్టం. వినకపోతే పో," అన్నాను. "సారీరా బాబూ! నీ కథ నీ ఇష్టం. సరే చెప్పు వింటాను!" అన్నాడు. డాడీ నన్ను

బుజ్జగిస్తూ. "సరే, ఐతే వినండి. అలా మా ట్రైన్ ఎగురుతూ ఎగురుతూ వెళ్తున్నది. క్లౌడ్స్ దాటి పోతున్నది. మా ఫ్రెండ్స్ వాటితో ఆడుకుంటున్నారు. కొందరు కొన్ని క్లౌడ్స్‌ని తీసుకుని తమ బ్యాగుల్లో దాచుకున్నారు." నేను యాక్షన్ చేస్తూ, చెప్తుంటే నాన్నకు మళ్ళీ ఓ ప్రశ్న అడగాలనిపించినట్టుంది. కానీ నేను కథ ఆపేస్తానేమో అనుకుని, నోరుమూసుకుని వింటూ కూచున్నాడు. "అలా ట్రైన్ ఇంకా పైకి పోతోంది. ఇంకా ఇంకా పోయీ పోయీ, మూన్ మీదికి వెళ్ళింది".

"మూన్ మీదికా?" అన్నాడు నాన్న ఉండబట్టలేక. నేను కాసేపు నాన్న వైపు కన్నార్పకుండా చూసి, కొంచెం ఆలోచించి, "సరే, నీకేమైనా డౌట్స్ వస్తే అడుగు. నేను చెప్తాను. ఒకే!" అని, మళ్ళీ ఇలా చెప్పాను. "ఔను. మూన్ మీదికి వెళ్ళి, అక్కడ ఆగింది. మొన్న మన రాకెట్ ఆగింది చూడు, అక్కడే అన్నమాట." ఈ మధ్య ప్రతిరోజూ వార్తల్లోనూ, యూట్యూబ్ లోనూ వాళ్ళు చంద్రయాన్ వార్తలు చూస్తున్నారు కదా! వాళ్ళతోబాటు కొన్ని సార్లు నేను కూడా చూశాను. దానికి నా ఊహలు కలిపి ఈ కథను తయారు చేస్తున్నానని అమ్మానాన్నలకు అర్థం ఐనట్టుంది. "భలే! తరువాతేమయింది?" కుతూహలంగా అడిగారు వాళ్ళు. నా కథను వాళ్ళు ఆసక్తిగా వింటున్నట్టు అనిపించింది. నేను నా కల్పనను మరింత పెంచాను. "అక్కడ ఓ పెద్ద హోల్ ఉంది. పెద్దదంటే... చాలా పెద్దదన్న మాట! మా రైలులో దానిలోపలికి వెళ్ళాం. అలా చాలా లోపలికి వెళ్ళాం. అక్కడ అంతా డార్క్... చీకటిగా... ఉంది.

'అక్కడ ఓ పెద్ద బిల్డింగ్ ఉంది. మేం రైలు దిగి లోపలికి వెళ్ళాం. బిల్డింగ్ చాలా ఓల్డ్. బోలెడు బ్యాట్స్, అంటే, గబ్బిలాలు ఉన్నాయి. మేం భయపడుతూ చూస్తుంటే అక్కడికి అప్పుడు ఓ విలన్ వచ్చాడు." అదిరిపోయే ఫీలింగ్తో, యాక్షన్తో నేను వాళ్ళ కళ్ళకు కట్టినట్టు చెప్తున్నాను. "నువ్వు హోల్ అని చెప్పిందాన్ని "క్రేటర్" అంటారు" అని చెప్పింది మమ్మి. "తరువాత ఏమైంది?" అడిగాడు నాన్న కుతూహలంగా.

"వాడి చేతిలో ఓ పెద్ద నైఫ్, కత్తి ఉంది. వెంటనే నేనూ, మా ఫ్రెండ్స్ గన్స్ తీసి పట్టుకున్నాం. "గన్నులు మీకెక్కడివి?" అడిగాడు డాడీ ఆశ్చర్యంగా!

"మేం ఆడుకోవడానికి మీరూ, వాళ్ళ ఫాదర్సూ కొనిచ్చారు కదా డాడీ!" చెప్పాను నేను, నీకు ఆ మాత్రం తెలియదా అన్నట్టు. "ఒకే! తరువాతేమయింది?" "మేం గన్స్ తీయగానే వాడు భయపడి, కారెక్కి స్పీడ్గా అక్కడ్నుంచి పారిపోయాడు. మేం ఆ కేవ్‌లోంచి బైటికొచ్చి చూస్తే, అక్కడ ఓ చోట ఓ పేద్ద మర్రిచెట్టు ఉంది. దాని కింద ఓ ముసలమ్మ, ఓ చిన్న హొటల్ ఉంది. ఆ హొటల్ పేరు "రాబిట్ ఇడ్లీస్", దాన్ని ఆ ముసలమ్మే నడిపిస్తుంది."

"మర్రిచెట్టూ, ముసలమ్మా...?" అంది మమ్మీ ఆశ్చర్యంగా. "ఔను తాతమ్మ మొన్న చెప్పింది కదా! చందమామలో మర్రిచెట్టూ ముసలమ్మా ఉందని," అన్నాను, 'మీకు అదికూడా తెలియదా?' అన్నట్టు చూస్తూ. అమ్మ తెలుసునన్నట్టు తల ఊపింది.

"మేమందరం అక్కడికి వెళ్ళాం. అక్కడ చాలా బాగుంది. పేద్ద ప్లే గ్రౌండ్ ఉంది. పక్కన పేద్ద లేక్ ఉంది. ఆ లేక్‌లో స్వాన్స్, డక్స్ స్విమ్మింగ్ చేస్తున్నాయి. మేం కూడా ఆ గ్రౌండ్లో బోలెడు ఆడుకున్నాం. ఆ లేక్‌లో స్విమ్మింగ్ చేశాం. తర్వాత ఆ గ్రాండ్‌మా హొటల్‌కు వెళ్ళాం. అక్కడ అన్ని పనులూ రాబిట్సే చేస్తున్నాయ్. మాతో మాట్లాడాయి. మాకెంతో హ్యాపీ అనిపించింది. మాతో రమ్మని పిలిచాం. కానీ అవి వాళ్ళ గ్రాండ్‌మాను విడిచి రామన్నాయి.

తరువాత ఆ గ్రాండ్‌మా మాకు ప్రేమతో పెట్టిన ఇడ్లీలూ, దోసెలూ తిని, థాంక్స్ చెప్పి, మా ట్రేనెక్కి తిరిగి వచ్చేశాం... అంతే... కథ అయిపోయింది... కథ బాగుందా!" అని అడిగాను మమ్మీడాడీలను.

చాలా బాగుందని చెప్పి వాళ్ళు నన్ను ముద్దుపెట్టుకున్నారు. మీక్కూడా నా కథ నచ్చితే మీరు కూడా నాకు ఓ ముద్దు ఇవ్వొచ్చు!

– డా. వి.ఆర్.శర్మ

m : 9177887749

# ఎగరేద్దామా సొగసైన మనజెండా



ఎగరేద్దామా సొగసైన మన జెండా
దిగి వచ్చి దేవతలు దీవెనలు యిస్తుండ
ఎగరేద్దామా సొగసైన మన జెండా ॥ఎగరే॥
పల్లెలోన ఢిల్లిలోనా ప్రజలందరిదీ రాజ్యం
భయం లేక సుఖంగాను చేద్దామా సేద్యం ॥ఎగరే॥
నాగలితో కొడవలితో నడవవోయి నేడే
కష్టపడి పని చేస్తే కలదు సుఖం నేడే ॥ఎగరే॥
మన దేశం మన జాతి అంతా మనదేనోయి
మన దేశ సంపదంతా మనకేనోయి మనకే నోయి ॥ఎగరే॥



– దాశరథి

(ఇది దాశరథి శతజయంతి సంవత్సరం)

# కలంచెలిమి



**ఇషాంత్**
9వ తరగతి, జెడ్‌పిహెచ్ఎస్.,
కలివెట్టు, బి.ఎన్. కండ్రిగ,
తిరుపతి.



**జి. వైష్ణవి**
8వ తరగతి,
జెడ్‌పిజిహెచ్ఎస్.,
కొండపాక, సిద్దిపేట.



**వి. అక్షిత**
10వ తరగతి,
సిరిసిల్ల.




**ఎం. మనోహర్**
9వ తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
లింగాపూర్, కామారెడ్డి.



**ఎం. స్ఫూర్తి**
10వ తరగతి,
తెలంగాణ ఆదర్శ పాఠశాల,
బచ్చన్నపేట, జనగామ.



**ఎ. మధుప్రియ**
9వ తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
ధర్మసాగర్, హనుమకొండ.




# పాము, తేలు కాటుకు ప్రథమ చికిత్స

### పాము కాటుకు ప్రథమ చికిత్స

పాము కాటుకు ఎలాంటి ప్రథమ చికిత్సను అందించాలి. వైద్య నిపుణుడిని సంప్రదించి పాము రూపాన్ని సాధ్యమైనంత ఖచ్చితంగా వివరించాలి. ఇది వైద్యానికి ఉపయోగపడుతుంది.

* బాధితుడిని అనవసరంగా కదల్చవద్దు, గాబరా పెట్టవద్దు.
* బాధితుడికి ఏమీ కాదని, త్వరగా వైద్యం అందుతుందని భరోసానివ్వాలి.
* శరీరం నుండి వాచ్, ఉంగరాలు, నగలు ఉంటే తొలగించాలి.
* కరిచిన భాగాన్ని సబ్బు నీటితో కడగాలి.
* బాధితుడిని స్ట్రెచర్ పైన ఎడమ వైపున పడుకొని కుడికాలు మడిచి చేతిని ముఖానికి మద్ధతుగా ఉంచుకోమని రవాణా చేయాలి. ఊపిరి బాగా పీల్చుకుంటాడు.
* కాటు ప్రాంతాన్ని కోయవద్దు. రక్తాన్ని పీల్చవద్దు. మసాజ్ చేయవద్దు.
* సొంత వైద్యంతో, మూఢనమ్మకాలతో విలువైన సమయాన్ని వృథా చేయవద్దు.

### తేలు కాటుకు ప్రథమ చికిత్స

తేలు కరిచిన వెంటనే మొదటగా కరిచిన ప్రాంతాన్ని క్రిమినాశక ద్రవం లేదా సబ్బుతో కడగాలి. బాధితుడికి ధైర్యం చెప్పాలి. ప్రభావిత భాగాన్ని కదలకుండా ఉంచాలి. గాయం నుండి రక్తం కార్చడం లేదా విషాన్ని నోటితో పీల్చడం వంటివి చేయవద్దు. నొప్పిగా ఉన్న ప్రాంతంలో ఐస్‌ప్యాక్‌ను ఉపయోగించవచ్చు. వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్ళాలి.

### కార్డియాక్ అరెస్ట్ (అకస్మాత్తుగా గుండె ఆగిపోవడము)

సి.పి.ఆర్. అంటే ఏమిటి? కరోనా వ్యాధి తర్వాత కూడా రకరకాల జబ్బులు తీవ్రరూపం దాల్చి పిల్లలు, ముసలివారు, యువకులు అని తేడా లేకుండా హఠాత్తుగా మరణిస్తున్నారు. అందులో ఒకటి కార్డియక్ అరెస్ట్. ఇది సాధారణంగా వచ్చే గుండెపోటు కాదు. హఠాత్తుగా గుండె ఆగిపోతుంది. వీరికి సి.పి.ఆర్. (కార్డియో పల్మనరీ రిససిటేషన్) అందిస్తే వారు రక్షించబడతారు. ఇది వైద్యుడు వచ్చే వరకు లేదా రోగి మాములుగా అయ్యేంత వరకు కొనసాగించాలి.

**– ఆరోగ్యం – విజ్ఞానం** ఆధారంగా...

తెలంగాణ సారస్వత పరిషత్తు, హైదరాబాదు.

# అంతరిక్ష విజ్ఞానం

ప్ర : అంతరిక్షంలోకి వెళ్లిన మొదటి భారతీయుడు ఎవరు?

**జ : రాకేష్ శర్మ**

ప్ర : ఎఎస్ఎల్వి ద్వారా స్రోస్-1 ఉపగ్రహం ఎప్పుడు ప్రయోగించబడింది?

**జ : 24 మార్చి 1987**

ప్ర : ఐఆర్ఎస్-1ఎ ఎప్పుడు ప్రయోగించబడింది?

**జ : 17 మార్చి 1988**

ప్ర : ఐఆర్ఎస్-1బి ఎప్పుడు ప్రయోగించబడింది?

**జ : 29 ఆగస్టు 1991**

ప్ర : ఇన్సాట్-2ఏ ఎప్పుడు ప్రయోగించారు?

**జ : 20 మే 1992**

ప్ర : పిఎస్ఎల్వి ద్వారా ఐఆర్ఎస్-పి2ను ఎప్పుడు ప్రయోగించారు?

**జ : 15 అక్టోబర్ 1994**

ప్ర : పిఎస్ఎల్వి ద్వారా ఐఆర్ఎస్-పి3ను ఎప్పుడు ప్రయోగించారు?

**జ : 21 మార్చి 1996**

ప్ర : పిఎస్ఎల్వి ద్వారా ఐఆర్ఎస్-1డి ఎప్పుడు ప్రయోగించబడింది?

**జ : 29 సెప్టెంబర్ 1997**

ప్ర : భారతదేశ అంతరిక్ష చరిత్రలో 1990 సంవత్సరం ప్రత్యేకత ఏమిటి?

**జ : పిఎస్ఎల్వి విదేశీ ఉపగ్రహాలను మోసుకెళ్లడం ప్రారంభించింది.**

ప్ర : జిఎస్ఎటి-1ని జిఎస్ఎల్వి-1 ద్వారా ఎప్పుడు ప్రయోగించారు?

**జ : 18 ఏప్రిల్ 2001**



ప్ర : అంతరిక్షంలోకి వెళ్లిన భారతీయ సంతతికి చెందిన మొదటి మహిళ ఎవరు?

**జ : కల్పనా చావ్లా**

ప్ర : ఇస్రో రూపొందించిన ప్రత్యేక వాతావరణ ఉపగ్రహాల సిరీస్‌లో మొదటిది ఏది?

**జ : మెట్‌సా1 (కల్పన-1గా పేరు మార్చబడింది), 12 సెప్టెంబర్ 2002.**

ప్ర : జిఎస్ఎల్వి-డి2 ద్వారా జిఎస్ఎటి-2ని ఎప్పుడు ప్రయోగించారు?

**జ : మే 8, 2003**

ప్ర : మొదటి ఎడ్యుకేషనల్ సాటిలైట్ ఏది?

**జ : ఎడ్యుసాట్ (20 సెప్టెంబర్, 2004)**

ప్ర : భారతదేశ మొదటి మూన్ మిషన్ ఏది?

**జ : చంద్రయాన్-1**

ప్ర : మంగళయాన్ అంటే ఏమిటి?

**జ : భారతదేశం యొక్క మంగళయాన్ మిషన్ మార్టిన్ వాతావరణాన్ని అధ్యయనం చేయడం లక్ష్యంగా పెట్టుకుంది.**

ప్ర : మార్స్ కక్ష్యలోకి ఎంఓఎం ఎప్పుడు ప్రవేశించింది?

**జ : 24 సెప్టెంబర్ 2014**

ప్ర : జిఎస్ఎల్వి అంటే ఏమిటి?

**జ : జియోసింక్రోనస్ శాటిలైట్ లాంచ్ వెహికల్**

ప్ర : ఆస్ట్రోశాట్‌ను ఎప్పుడు ప్రయోగించారు?

**జ : ఆస్ట్రోశాట్ భారతదేశపు మొట్టమొదటి ప్రత్యేక బహుళ-తరంగదైర్ఘ్య అంతరిక్ష టెలిస్కోప్. ఇది 28 సెప్టెంబర్ 2015న పిఎస్ఎల్వి-ఎక్స్ఎల్ ద్వారా ప్రయోగించబడింది.**

**– ఆరోగ్యం-విజ్ఞానం**

తెలంగాణ సారస్వత పరిషత్ ఆధారంగా..

✦ విద్యార్థులే స్ఫూర్తిదాతలు

# గుండె ఆపరేషన్ అయినా గుండె ధైర్యం వీడని వైద్య విద్యార్థి సుమన్

ములుగు జిల్లాలోని జవహర్ నగర్ అనే చిన్న గ్రామం సుమన్ ఊరు. వ్యవసాయ ఆధారిత కుటుంబం. గత పదకొండు సంవత్సరాలుగా నేను పని చేస్తున్నది కూడా ఆ ఊరిలోనే. మా మోడల్ స్కూల్ మరియు జూనియర్ కాలేజీలో చదివిన ఎందరో విద్యార్థులలో సుమన్ ఓ విలక్షణమైన విద్యార్థి. హైస్కూల్ విద్య అంతా ప్రభుత్వ పాఠశాలలోనే. చాలా నెమ్మది మనిషి. నవ్వడం మాత్రం మనస్ఫూర్తిగా నవ్వుతాడు అదికూడా శబ్దం రాకుండా! మంచి ఆర్టిస్ట్ కూడా! వీడి ఆ నిశ్శబ్దం వెనుక కారణం ఏమై ఉంటుందా అని ఎప్పుడూ అనుకుంటూ ఉండే వాడిని. ఒకరోజు ఇంటర్మీడియట్ బైపిసి సెకండియర్ పిల్లలకు ఇంగ్లిష్ బోధిస్తున్నప్పుడు ఉన్నట్టుండి ఒక్కసారిగా సుమన్ క్రింద పడిపోయాడు. అప్పుడే నాకు తెలిసింది మూడవ తరగతిలో ఉన్నప్పటి నుండే సుమన్ గుండెకు సంబంధించిన అనారోగ్యంతో చాలా ఇబ్బంది పడుతున్నాడని. సెకండియర్లో కేవలం మూడు నెలలు మాత్రమే కళాశాలకు హాజరయ్యాడు. మిగతా ఆరు నెలలు ఆసుపత్రుల చుట్టూ తిరగడంతోనే సరిపోయింది. హైదరాబాదులో గుండె ఆపరేషన్ అయ్యింది. మనిషి కూడా చాలా సన్నగా ఉండటం, హెల్త్ కండిషన్ సీరియస్‌గా ఉంది అని అన్నారు. అమ్మానాన్నల ప్రయత్నం, వైద్యుల సహకారంతో సుమన్ కోలుకున్నాడు. ఆ పరిస్థితులలో ఎవరైనా బతికి బయటపడటమే గొప్ప విషయం అనుకుంటారు. నేను కూడా చాలా మంది విద్యార్థులను చూశాను, చిన్నచిన్న కారణాలకే విద్య నుండి దూరంగా జరిగిన వాళ్ళు. కానీ సుమన్ అలా కాదు, ఎంబీబీఎస్‌లో సీట్ సంపాదించడం కోసం ఎంతో కష్టపడ్డాడు. పట్టుదల అంటే వాడిది! ఎందరు వారించినా కూడా వినకుండా తన ప్రయత్నాన్ని కొనసాగించాడు, చివరికి అందులో విజయం సాధించాడు. సిద్దిపేటలోని వైద్య కళాశాలలో ఎంబిబిఎస్ సీటు సంపాదించి, ఇటీవల వైద్య విద్యను పూర్తి చేశాడు. ఆలోచన వాడిదే, శ్రమ వాడిదే, పట్టుదల వాడిదే, వీడి ఈ విజయం మాత్రం అందరిది!



తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు గర్వపడేలా చేసిన సుమన్ అభినందనీయుడు, ఎందరికో ఆదర్శనీయుడు! ఇటువంటి విద్యార్థి నాకు ముందే ఎందుకు తారసపడలేదా అని అనిపిస్తూ ఉంటుంది! వీడి నుండి స్ఫూర్తిని పొంది ఇంకా ఏమైనా సాధించేవాడినేమోనని! చివరిగా మొన్న ఫోన్లో మాట్లాడినప్పుడు సుమన్‌ని అడిగాను 'నీకు డాక్టర్ కావాలని ఎప్పుడు అనిపించింది?' అని.


దీనికి సుమన్ స్పందన ఇది "నాకు గుండె ఆపరేషన్ అయినప్పుడే సార్! అప్పుడే నేను వైద్యుని యొక్క గొప్పతనం తెలుసుకున్నాను. అంతకు ముందు బైపిసి తీసుకున్నాను కానీ, డాక్టర్ కావాలనే బలమైన కోరిక లేదు. ఎప్పుడైతే నేను ఆపరేషన్ నుండి కోలుకున్నానో అప్పుడే స్థిరంగా నిర్ణయించుకున్నాను. కచ్చితంగా డాక్టర్ కావాలి నాలాంటి ఎందరికో సేవ అందించాలని!"

హ్యాట్సాఫ్ టు యు సుమన్! నువ్వు ఖచ్చితంగా గొప్ప శిఖరాలను అధిరోహిస్తావు. మరెందరికో స్ఫూర్తిగా నిలుస్తావు. రానున్న రోజుల్లో మన పాఠశాల కార్యక్రమానికి ముఖ్య అతిథివి నువ్వే!... ఐ లవ్ యు డియర్!

– కాసుల రవికుమార్
m : 99083 11580



# జిరాఫీ



పొడవైన మెడ – పొడవైన కాళ్ళు, అందమైన మచ్చలూ కలిగి, చూపరులను ఇట్టే ఆకర్షించే జంతువు ప్రపంచంలోనే పొడవైన జంతువు జిరాఫీ.

జిరాఫీ సుమారు 6 మీటర్ల పొడవు ఉంటుంది. తల చిన్నదిగా, పరిమితంగా ఉంటుంది. మెడ మాత్రం పొడవుగా ఉంటుంది. చిత్ర మేమిటంటే ఇంత పొడవైన మెడలో కేవలం ఏడు ఎముకలే ఉంటాయి. 'జీన్ బాప్టిస్ట్ డీలామార్క్' అనే ప్రముఖ ఫ్రెంచ్ జీవ శాస్త్రజ్ఞుడు దీని పొడవైన మెడ గురించి ఆసక్తికరమైన విషయాలు వెల్లడించాడు. మొదట దీని మెడ చిన్నదిగా ఉండేదట. ఎత్తయిన చెట్ల కొమ్మలకి ఉన్న ఆకులను సైతం అందుకుని తినడం దీని అలవాటు కావడం వల్ల, మెడ అలా సాగి సాగి పొడవుగా పెరిగిందట. నల్లటి సున్నితమైన కళ్ళతో జిరాఫీ చూడటానికి ఎంతో హుందాగా అందంగా ఉంటుంది. ఇది ప్రమాదాన్ని చాలా తొందరగా గ్రహిస్తుంది. దీని చెవులు, కళ్ళు చాలా చురుకుగా పనిచేస్తాయి. చాలా వరకు జిరాఫీ మౌనంగానే ఉంటుంది. దీని తలపై కొమ్ములు నిలువుగా ఉండి, చర్మంతో కప్పబడి ఉంటాయి. కొన్ని జిరాఫీలకు మూడవ కొమ్ము చిన్నదిగా, తలపై నుండి వస్తుంది. జిరాఫీ ఆకులూ గడ్డి తింటుంది. పెద్ద పెద్ద చెట్ల కొమ్మల చివర గల ఆకుల్ని నోటితో అందుకుని తినేందుకు దీని పొడవైన మెడ ఎంతో ఉపయోగపడుతుంది. దీని గొంతు 45 సెం.మీ పొడవు ఉంటుంది. ఇది కాళ్ళను నాలుగు వైపులకూ విస్తరింపజేసి, కూర్చొని నీళ్ళు తాగుతుంది. జిరాఫీ చర్మంపైన వెంట్రుకలు, సున్నితంగా, చిన్నవిగా ఉండి తోక చివర వెంట్రుకలు కుచ్చులా ఉంటాయి. శరీరం అంతటా ఎరుపు, మట్టిరంగుతో కలిసిన వర్ణంలో పెద్ద పెద్ద మచ్చలూ, తెలుపు బోర్డర్ ఉంటాయి. సాధారణంగా జిరాఫీలు ఎప్పుడూ నడుస్తూనే ఉంటాయి. సింహం లాంటి మృగాలు వెంటపడితే మాత్రం ఇవి గంటకు 45 కిలోమీటర్ల వేగంతో పరిగెడతాయి. జిరాఫీ పిల్ల, పుట్టిన తరవాత మూడు నాలుగు రోజులు తల్లి వెంటే తిరుగుతుంది. తర్వాత క్రమంగా అది తన ఆహారాన్ని తానే తింటుంది జిరాఫీలు ఎక్కువగా ఆఫ్రికాలో ఉన్నాయి.

– బాలచెలిమి

జనవరి 1991, బాలచెలిమి మాసపత్రిక నుండి

# ఎండలు కాసేదెందుకురా?

ఎండలు కాసేదెందుకురా?
మబ్బులు పట్టేటందుకురా
మబ్బులు పట్టేదెందుకురా?
వానలు కురిసేటందుకురా
వానలు కురిసేదెందుకురా?
పంటలు పండేటందుకురా
పంటలు పండేదెందుకురా?
ప్రజలు బ్రతికేటందుకురా.





# మా తాత అందం

మా తాత అందం
చందమామ చందం
మా తాత గుండు
గుమ్మడి పండు
మా తాత మీసం
రొయ్యల మీసం
మా తాత పిలక
పంచదార చిలుక







కథ

# అతిపెద్ద పుస్తకం




రాజు వయస్సు పది సంవత్సరాలే గాని పుస్తకం కనిపిస్తే చాలు ఆగిపోతాడు. పుస్తకంలోఏముందో చూస్తాడు. తనకు నచ్చిన అంశం ఉంటే ఎగిరి గంతేస్తాడు. ఆ పుస్తకం ఎవరిదో తెలుసుకుని వాళ్ళను అడుగుతాడు. ఇవ్వడం కుదరదంటే వాళ్ళను బతిమిలాడుతాడు. వాళ్ళ మనస్సును కరిగిస్తాడు. ఎలాగోలా పుస్తకం సంపాదించి ఆ పుస్తకాన్ని చదివేస్తాడు. అప్పటికి గాని రాజుకు నిద్ర పట్టదు.ఆ అలవాటు పెద్ద తరగతులకు వచ్చినా ఉండిపోయింది. పాఠశాల గ్రంథాలయంలోని పుస్తకాలన్నీ చదివేశాడు. అంతటితో ఆగక సెలవు రోజుల్లో అతడు ఊళ్ళో ఉన్న గ్రంథాలయానికి వెళ్ళడం ఆరంభించాడు. కొన్నాళ్ళకు ఆ గ్రంథాలయం లోని పుస్తకాలు కూడా చదివేశాడు.

ఒక రోజు వాళ్ళ తాతగారు ఇంటికి వచ్చారు. మనవడితో మాట్లాడారు. మాటల్లో మనవడు చదివిన పుస్తకాల గురించి చెప్పాడు. మనవడికి పుస్తక పఠనం మీద ఉన్న ఆసక్తికి తాతగారు ఆశ్చర్య పోయారు. గొప్పవాడుగా ఎదగడానికి కావలసిన లక్షణాలన్నీ మనవడిలో ఉన్నాయని పసిగట్టి చాలా సంతోషించారు.

తాతగారితో రాజు మాట్లాడుతూ “తాతగారూ! పెద్ద పెద్ద పుస్తకాలు నాకు చదవాలని ఉంది. పెద్దయ్యాక నా కోరిక తీర్చుకుంటాను. ఆ పెద్ద పుస్తకాల పేర్లు నాకు చెప్పండి.గుర్తుంచుకుని ఆ పుస్తకాలు చదివి నా కోరిక నెరవేర్చుకుంటాను. ఖాళీగ ఉండడం నాకు ఇష్టం ఉండదు” అన్నాడు. అప్పుడు తాతగారు మనవడి భుజం తట్టి “లోకంలో ఒక పెద్ద పుస్తకం ఉంది. నీకు భలే ఊసుపోతుంది. ఆ పుస్తకం చూస్తే సరి, మనసుకు ప్రశాంతత కలుగుతుంది. ఆ పుస్తకం ఎంత చదివినా తరగదు. చదువుతున్న కొలది ఇంకా ఇంకా కొత్త కొత్త విషయాలు తెలుస్తూనే ఉంటాయి.ఆ విషయాలు గమనించి కొత్త ఆలోచనలు నువ్వు లోకానికి చెబితే నీకు లోకం జేజేలు కొడుతుంది!” అన్నారు.

ఆ మాటలు విన్న రాజు ‘‘తాతగారూ... తాతగారూ... అంత పెద్ద పుస్తకమా అది?! అయితే చెప్పండి. నేనది చదివి తీరుతాను! లోకానికి మేలు చేస్తాను” అని ఎగిరి గంతేశాడు. తాతగారి నోటి వెంట వచ్చే మాట కోసం ఎదురు చూడసాగాడు.

"ఒరే రాజూ, ఆ పుస్తకం లో అక్షరాలు ఉండవు. పేజీలుండవు. ఎక్కడ పడితే అక్కడికి మోసుకు వెళ్ళ లేము!" అన్నారు తాతగారు. "అదేంటి తాతగారూ! పుస్తకం పేరడిగితే... పొడుపు కథ చెప్పారు" నవ్వుతూ అడిగాడు మనవడు. "పొడుపు విప్పగలవా అయితే.." తాతగారు అన్నారు. "ఏదైనా ఆధారం చెప్పండి!" మనవడు అడిగాడు. "ఎన్నో వింతలు అందులో ఉ ంటాయి. పంచ భూతాలు కనిపిస్తాయి" అన్నారు తాతగారు. "ఆ పుస్తకం ఏదో నాకు తెలిసిపోయింది" ఆనందంతో చప్పట్లు కొట్టాడు మనవడు. "అయితే చెప్పు?" అడిగారు తాతగారు. "ప్రకృతి!!!" కళ్ళు పెద్దవి చేస్తూ చెప్పాడు మనవడు.

తాతగారు మనవడి తెలివితేటలకు అబ్బురపడ్డారు. "బాగా పోల్చావు" అని అభినందించారు. అప్పుడు రాజు "ప్రకృతి ఎలా పుస్తకం అవుతుంది తాతగారూ?" అని అడిగాడు. తాతగారు నవ్వుతూ "మనిషి కంటే ప్రకృతే ముందు పుట్టింది. ఆ ప్రకృతిని పరిశీలించే మనిషి జంతు దశ నుంచి నాగరిక దశకు వచ్చాడు.


ప్రకృతిలో పరిశీలించడానికి ఇంకా ఎన్నో విషయాలు దాగొని ఉన్నాయి. పరిశీలన ద్వారా వాటిని మనం గ్రహించాలి. అప్పుడే ప్రపంచానికి నూతన ఆవిష్కరణలు అందివ్వగలం. మనిషి ఆలోచించాలే గాని, ప్రకృతి లోని ఏది కూడా అనవసరంగా ఉండదు.

ఏదో ఒక ప్రయోజనం ఉండి తీరుతుంది. శోధించి సాధించాలి.అదే తెలివి తేటల పరమార్థం!" అన్నారు. రాజు మీద తాతగారి మాటలు పని చేశాయి. ఆ రోజు నుంచి అతడి ఆలోచన తీరు మారింది. చదువుతో పాటు ప్రకృతి పరిశీలన అతడికి జీవితంలో ఒక భాగమైంది. తాతగారు మనవడిలో కాబోయే ఒక మేధావిని ఒక శాస్త్రవేత్తను చూశారు.

– బెలగాం భీమేశ్వరరావు
9989537835

నేర్చుకుందామా

# చేతిలో బొమ్మ



**ఎందుకు** : చిత్ర లేఖనం కోసం.

**ఏం కావాలి** : స్కెచ్ పెన్స్, తెల్ల కాగితాలు

**ఎలా చేయాలి** : టీచరు తన ఎడమ చేతిని కాగితం పై ఉంచి చుట్టూ అంచు గీసుకోవాలి. పిల్లలతో అలాగే చేయించాలి.

ఇక్కడ వేగం ముఖ్యం కాబట్టి టీచరు జాగ్రత్తగా లెక్కిస్తూ ఉండాలి. పిల్లలు లైనులో వచ్చేలా చూసుకోవాలి. రాళ్ల కుప్ప దగ్గర రద్దీ లేకుండా చూడాలి.

తరువాత చేతి బొమ్మ మీద రంగులతో రకరకాల నమూనాలు వేసుకోవాలి. పక్కపక్క వాళ్లు బొమ్మలు ఒకరికొకరు మార్చుకోవాలి. పక్కవాని చేతి బొమ్మ మీద తన చేతిని ఉంచి తన చేయి పెద్దదో, పక్కవాని చేయి పెద్దదో సరిచూసుకోవాలి. తరువాత పక్కవాని చేతిని పరిశీలించాలి. మెత్తగా ఉందా? గట్టిగా ఉందా? చల్లగానా, వేడిగానా? అలా అందరూ చూసుకోవాలి.

**చర్చ** : నీ చేతి మీది గీతలు, పక్కవాడి చేతి గీతలతో పోల్చుకో. చేతిలో గీతలు ఎందుకు ఉంటాయి?

– టి.వి.ఎస్. రమేష్,
'నేర్చుకోవడం మాకిష్టం' నుండి...

## టీచరమ్మగా రాష్ట్రపతి



దేశ ప్రథమ పౌరురాలిగా ద్రౌపదీ ముర్ము బాధ్యతలు చేపట్టి నేటికి సరిగ్గా రెండేళ్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా ఆమె తనకెంతో ఇష్టమైన వృత్తి అయిన ఉపాధ్యాయురాలిగా మారారు. ప్రెసిడెంట్ ఎస్టేట్‌లోని డా.రాజేంద్ర ప్రసాద్ కేంద్రీయ విద్యాలయ పాఠశాలకు వెళ్లి తొమ్మిదో తరగతి విద్యార్థులకు పాఠాలు బోధించారు. తొలుత విద్యార్థుల పేర్లు అడిగిన రాష్ట్రపతి వారి అభిరుచులు, లక్ష్యాలు తెలుసుకున్నారు. ఈ తరం విద్యార్థులు ఎంతో ప్రతిభావంతులని, సాంకేతికంగా వీరికి పుష్కలమైన అవకాశాలు ఉన్నాయని ముర్ము అన్నారు. అనంతరం గ్లోబల్ వార్మింగ్‌పై వారికి బోధించారు. భావితరాల కోసం పర్యావరణాన్ని కాపాడుకోవాలని విద్యార్థులకు తెలియజేశారు. నీటి సంరక్షణ ప్రాముఖ్యాన్ని వివరించారు. పర్యావరణ మార్పు ప్రభావం మనపై పడకుండా ఉండాలంటే వీలైనన్ని ఎక్కువ మొక్కలు నాటాలని విద్యార్థులను ప్రోత్సహించారు. నీటి సంరక్షణ ప్రాముఖ్యాన్ని విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ పిలుపునిచ్చిన 'ఏక్ పేడ్ మా కే నామ్ (అమ్మ పేరుతో ఒక మొక్కను నాటండి)' గురించి ప్రస్తావించారు. ప్రతీ విద్యార్థి తమ పుట్టిన రోజున ఓ మొక్క నాటాలని రాష్ట్రపతి ఆకాంక్షించారు.

## 'తప్పెవరిది?' బాలల కథా సంపుటి ఆవిష్కరణ




పార్వతీపురం దరి జట్టు సమావేశ మందిరంలో 15.07.2024 నాడు జరిగిన కార్యక్రమంలో ప్రముఖ బాల సాహితీవేత్త, కేంద్ర సాహిత్య అకాడమి బాల సాహిత్య పురస్కార గ్రహీత నారంశెట్టి ఉమామహేశ్వరరావు రచించిన "తప్పెవరిది" బాలల కథా సంపుటిని డా. పారినాయుడు, బెలగాం భీమేశ్వరరావు కలసి ఆవిష్కరించారు. "బాలసాహిత్య పుస్తకాలను ప్రభుత్వమే కొనుగోలు చేసి పాఠశాలలకు, గ్రంథాలయాలకు సరఫరా చేసినప్పుడే పిల్లలకు మంచి అలవాట్లు, మంచి లక్షణాలు అలవడతాయని, అప్పుడే భావితరాలు బాగుంటాయని" డా.పారినాయుడు అన్నారు. కేంద్ర సాహిత్య అకాడమి బాల సాహిత్య పురస్కార గ్రహీత బెలగాం భీమేశ్వరరావు మాట్లాడుతూ "నారంశెట్టి గారి రచనలు పిల్లల మనసుల్ని దోచుకునేలా ఉంటాయని, అందుకే ఆయన ద్వారా పార్వతీపురానికి కేంద్ర సాహిత్య అకాడమి పురస్కారం వచ్చిందని, పార్వతీపురంలో బాల సాహిత్య సృజన ఎక్కువ జరగడం వల్లనే ఇప్పటికి రెండు కేంద్రసాహిత్య పురస్కారాలు తనతో సహా వచ్చాయని" అన్నారు. పెద్దలు, గురువులు తప్పక తమ పిల్లలచే బాల సాహిత్యాన్ని చదివించాలని పిలుపునిచ్చారు. పుస్తక రచయిత నారంశెట్టి మాట్లాడుతూ "తన రచనలను హైదరాబాదుకి చెందిన నవచేతన పబ్లికేషన్స్ వారు 'తప్పెవరిది' పేరుతో ప్రచురించడం, దానిని జట్టు కార్యాలయంలో కవులు, కళాకారుల మధ్య ఆవిష్కరించడం సంతోషంగా ఉందని, ఆ కథలను పిల్లలు చదివి ప్రయోజనం పొందాలని చెప్పారు. ఇది తన ముప్పై రెండవ పుస్తకం అనీ, ఇంకా చాలా పుస్తకాలు ముద్రణ కావాల్సి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నటుడు, రచయిత రౌతు వాసుదేవరావు, బాలసాహితీవేత్త బెహరా ఉమా మహేశ్వరరావు, చిత్రకారుడు తుంబలి శివాజీ, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడు, వ్యవసాయ పుస్తకాల రచయిత టి. శివకేశవరావు, అల్లువాడ కైలాసరావు, కవి, నటుడు పక్కి రవీంద్రనాథ్, పి. గౌరీశ్వర్ మొదలగు వారు పాల్గొన్నారు.




**నారంశెట్టి ఉమామహేశ్వరరావు**
పార్వతీపురం
m : 9490799203

## ప్రముఖ బాలసాహితి వేత్త గరిపెల్లి అశోక్‌కు పెండెం జగదీశ్వర్ జాతీయ స్మారక పురస్కారం

బాల సాహిత్యానికి పెండం జగదీశ్వర్ చేసిన సేవలు చిరస్మరణీయమని ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ముదుంబై పురుషోత్తమాచార్య అన్నారు. తేది 17 జూలై, 2024 బుధవారం రోజున నల్లగొండ పట్టణంలోని నాగార్జున ప్రభుత్వ కళాశాలలో జరిగిన పెండెం జగదీశ్వర్ స్మారక జాతీయ పురస్కార ప్రదానోత్సవ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. నాగార్జున ప్రభుత్వ కళాశాల తెలుగు శాఖ అధ్యక్షులు డాక్టర్ తండు కృష్ణ కౌండిన్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పెండెం జగదీశ్వర్ స్మారక జాతీయ పురస్కారాన్ని సిద్దిపేటకు చెందిన ప్రముఖ బాలసాహితీవేత్త గరిపల్లి అశోక్ కు అందజేసి ఘనంగా సన్మానించారు. ప్రముఖ సాహితీవేత్త డాక్టర్






అమ్మిన శ్రీనివాసరాజు మాట్లాడుతూ జగదీశ్వర్ అనంతరం అతని స్నేహితులు ఒక జాతీయ పురస్కారాన్ని ఏర్పాటు చేసి బాలసాహితీవేత్తలకు అందిస్తుండడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమానికి సమన్వయకర్తగా సృజన సాహితి అధ్యక్షులు పెరుమాళ్ళ ఆనంద్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో పుప్పాల కృష్ణమూర్తి, అలుగుబెల్లి రామచంద్రారెడ్డి, ఎన్ వి రఘువీర్ ప్రతాప్, కుకుడాల గోవర్ధన్, పెందోట సోము, డాక్టర్ సిరి, కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, దాసోజు శ్రీనివాస్, డాక్టర్ సాగర్ల సత్తయ్య, బైరెడ్డి కృష్ణారెడ్డి, వడ్డేపల్లి వెంకటేష్, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎడ్ల సైదులు, డిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతురాజు వెంకులు తదితరులు పాల్గొన్నారు.

## పెందోట బాల సాహిత్య పురస్కారం..

ప్రముఖ రచయిత, బాలసాహితీ వేత్త, కథా సమీక్షకులు, కె.వి.లక్ష్మణ రావుకి పెందోట బాలసాహిత్య పురస్కారం లభించింది. తేది 30-06-2024 నాడు ఆదివారం సిద్దిపేటలో శ్రీవాణి సాహిత్య పరిషత్తు మరియు పెందోట బాలసాహిత్య పీఠం ఆధ్వర్యంలో జరిగిన దశమ వార్షికోత్సవ సమావేశంలో ముఖ్య అతిథి సామ సువర్ణ దేవి చేతుల మీదుగా పురస్కారం



అందుకున్నారు. కె.వి.లక్ష్మణ రావు రాసిన "టక్కరి మొసలి" అనే పుస్తకానికి ఈ గౌరవం లభించింది. ఈ పుస్తకం నవచేతన పబ్లిషర్స్ ద్వారా 2023 సంవత్సరంలో విడుదలైంది. కె.వి.లక్ష్మణ రావు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని, కోనసీమ జిల్లాలోని, పి.గన్నవరం మండలంలో గల ఊడి మూడి గ్రామంలో, ప్రాథమిక పాఠశాలలో సెకండరీ గ్రేడ్ టీచర్‌గా పని చేస్తున్నారు. 2019లో ఇదే నవచేతన పబ్లిషర్స్ ద్వారా, "అంతా ఒక్కటే" అనే బాలల కథా సంపుటి కూడా విడుదలైంది. ఈ కార్యక్రమంలో బాలసాహిత్య పీఠం నిర్వహకులు పెందోట వెంకటేశ్వర్లు, ఎన్నవెల్లి రాజమౌళి, అయిత చంద్రయ్య, కొండి మల్లారెడ్డి, దాశరదుల బాలయ్య, మాడుగుల మురళీధర శర్మ, సత్తయ్య, వరుకోలు లక్మమయ్య, పరుశరాములు, శాంత కుమారి, ఏడ్ల లక్ష్మి, సుధాకర్‌తో పాటు బాల సాహిత్య పురస్కార గ్రహీతలు బసవేశ్వర్, చెరుకుపల్లి హారిక, కాసర్ల నరేష్ రావు, కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, సయ్యద్ షఫీ, బండోజు శ్రావ్య, డేగల వైష్ణవి తదితరులు పాల్గొన్నారు. మొన్న తెలంగాణా సారస్వత పరిషత్ నిర్వహించిన బాలల కథా పోటీలలో, కె.వి.లక్ష్మణ రావు రాసిన, "తాతయ్య నేర్పిన పాఠం"కు ఉత్తమ కథా పురస్కారం లభించడం గమనార్హం. కె.వి.లక్ష్మణ రావుకి బాల సాహిత్య పురస్కారం లభించడం పట్ల కోనసీమ జిల్లాలోని, ఆయన స్నేహితులు, సన్నిహితులు, పి.గన్నవరం మండల విద్యాశాఖాధికారులు, తోటి ఉపాధ్యాయ మిత్రులు అందరూ, అభినందనలు తెలిపారు. సంతోషం వ్యక్తం చేశారు.

– సచిన్ కోత్వాల్

బాలచెలిమి డెస్క్, m : 8686664949

# డా. మాడభూషి రంగచార్య స్మారక సంఘం





**డా.** మాడభూషి రంగచార్య స్మారక సంఘం జంట నగరాలలో బడిపిల్లలకు కథారచన కార్యశాల ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ స్కూల్, హిమాయత్ నగర్‌లో నిర్వహించింది. 27.05.2024 నాడు శనివారం రోజున 9-30 ని.లకు రచయిత్రి గిరిజ పైడిమర్రి అధ్యక్షతలో కార్యక్రమం ప్రారంభమైంది. ఇందులో 18 పాఠశాలల నుంచి సుమారు 220 మంది పిల్లలు ఉత్సాహంగా పాల్గొన్నారు. డా. మాడభూషి రంగచార్య స్మారక సంఘం అధ్యక్షురాలు శ్రీమతి మాడభూషి లలితా దేవి మాట్లాడుతూ ఈ రోజుల్లో పిల్లలను, పెద్దలను కూడా, సోషల్ మీడియా ప్రభావితం చేస్తున్న తరుణంలో సుమారు 220 మంది పిల్లలు కథలు ఎలా రాయాలో తెలుసుకొని, కథలు రాయడానికి రావడం భవిష్యత్ తరాలకు శుభసూచకమన్నారు. తమ సంఘం గత పాతికేళ్ళుగా తెలుగు భాష, సంస్కృతీ సంప్రదాయాలను నిలబెట్టడానికే ఇలాంటి కార్యక్రమాలు చేస్తున్నదని చెప్పారు. ముఖ్య అతిథిగా పాఠశాల డైరెక్టర్ శ్రీమతి మణికొండ ప్రార్థన మాట్లాడుతూ.. "18 పాఠశాలల నుంచి సుమారు 220 మంది బడి పిల్లలకు కథారచన కార్యశాలను తమ పాఠశాలలో నిర్వహించడం తమకు గర్వకారణమని" అన్నారు. బాల వికాస కార్యకర్త శ్రీ. గరిపెల్లి అశోక్ అధ్యక్షతలో రెండో సెషన్ మొదలైంది. బాలోత్సవ్ నిర్వాహకులు శ్రీ. శాంతారావు గారు ధ్వన్యనుకరణ పద్ధతులతో సృజనాత్మకంగా కథలు ఎలా రాయ వచ్చునో చాలా ఆసక్తికరంగా పిల్లలకు వివరించారు. బాలల రచయిత వి.ఆర్. శర్మగారు పాటలతో, పద్యాలతో పిల్లలను ఉత్సాహ పరుస్తూ, భాషాదోషాల వలన సంభవించే అర్థభేదాలను, విరామ చిహ్నాల ఆవశ్యకతను సోదాహరణంగా వివరిస్తూ సునాయాసంగా కథలు రాయడంలోని మెళకువలను చెప్పారు.

**"పిల్లలతో ముచ్చట"**

పిల్లల సందేహాలను విషయ నిపుణులందరూ చాలా ఓపికగా నివృత్తి చేశారు. కథలు రాయగలమన్న ఆత్మ విశ్వాసాన్ని పిల్లలకు కలిగించారు. నిర్వాహకులు గంట సమయమిచ్చి పిల్లలచేత కథలు రాయించారు. ఎంతో ఆసక్తితో పిల్లలు రాసిన కథలను బాల రచయిత్రులు డా. అమరవాది నీరజ, డా. హారిక చెరుకుపల్లి, శ్యామల గార్లు అప్పటికప్పుడు దోషాలు సరిదిద్ది, ఉత్తమమైన వాటిని ప్రకటించారు. సమయోచితంగా కథావస్తువును ఎన్నుకోవడం ఈ కథలోని ప్రత్యేకత అని న్యాయనిర్ణేతలు వెల్లడించారు.

**ప్రథమ బహుమతి :** కథ పేరు : "తల్లిదండ్రులు". మేడ రిషికారెడ్డి, ఎనిమిదో తరగతి, సెయింట్ జోసెఫ్ పబ్లిక్ స్కూల్, వనస్థలిపురం. **ద్వితీయ బహుమతి :** కథ పేరు: "బోనాలు - అమ్మమ్మ గారిల్లు". యామినీప్రియ, పదవ తరగతి, హిమాయత్ నగర్ ప్రభుత్వోన్నత పాఠశాల పి.ఆర్ విద్యాలయం. **తృతీయ బహుమతి :** కథ పేరు: "నిరాశపరచిన బూట్లు". పి. ప్రతీక్, తొమ్మిదో తరగతి, సెయింట్ జోసెఫ్ పబ్లిక్ స్కూల్ - హబ్సిగూడ.

నేషనల్ బుక్ ట్రస్ట్ ఇండియా సంపాదకులు డా.పత్తిపాక మోహన్ అధ్యక్షతలో చివరి సెషన్ జరిగింది. తాను ఏడో తరగతి చదువుతున్నప్పుడు చొక్కా పుగారి ఆటోగ్రాఫ్ తీసుకున్నా నని గుర్తు చేసుకున్నారు. పిల్లల్లో ఉన్న సాహిత్యాభిలాషకు అబ్బుర పడ్డారు. ముఖ్య అతిథి తెలంగాణా సాహిత్య అకాడమీ కార్యదర్శి శ్రీ డా. నామోజు బాలాచారి మాట్లాడుతూ.... యూనిసెఫ్‌లో పని చేస్తున్న కాలంలో... ప్రభుత్వ పాఠశాలల పిల్లలకు నివేదికా రచనలో కార్యశాలలు నిర్వహించినట్లు చెప్పారు. పిల్లలతో పని చేయడం ఉత్సాహంగా ఉంటుందన్నారు. బాలల అభివృద్ధి కార్యక్రమాలకు తమ శక్త్యానుసారం కృషి చేస్తామని చెప్పారు. విశిష్ట అతిథి మ్యాజిక్ చాప్లిన్ శ్రీ. చొక్కాపు వెంకట రమణ మాట్లాడుతూ... కథ ఎత్తుగడ ముగింపులే ముఖ్యం అన్నారు. కథ నిడివితో సంబంధం లేదన్నారు. శబ్దానుకరణ లోని గమ్మత్తులను సోదాహరణంగా వివరించారు. వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది. సదస్సు ఆసాంతం ఎంతో ఉత్సాహంగా జరిగింది.

గిరిజ పైడిమర్రి



m : 9949443414

# నేనూ నా బాల్యం - చిందు ఎల్లమ్మ

పంట కోతల సమయంలో పంటను ఇంటికి తెచ్చుకుంటున్న సంబురంలో ఆ శ్రమజీవులంతా కలిసి ఆడతారు, పాడతారు. ఈ రకమైన పండుగ వేడుక ప్రతీ నాగరికతలో, ప్రతీ సముదాయంలో ఉంటుంది. బహుశ 'చిందు' కు అక్కడే ఒక వ్యవస్థీకృత రూపం ఏర్పడి అది కొనసాగడానికి ప్రాతిపదిక ఏర్పడి ఉంటుంది. ప్రాతిపదికలు, పునాది అంశాలు ఏం ఉన్నా.. ఏమైనా చిందు భాగవతం పల్లె నుంచి ప్రపంచానికి ఎదగడానికి మాత్రం చిందుల ఎల్లమ్మ కృషి ఎనలేనిది. ఈ కృషి వెనుక వ్యక్తిగత జీవితాన్నే ఫణంగా పెట్టిన వైనమిది. గత్తరొస్తే ఊర్లకు ఊర్లే గడగడ లాడిపోయేవి. అలాంటి గత్తరొచ్చిన కాలంలో ఊరిడిసి పోయి, తిరిగి వచ్చేటప్పుడు పుట్టి, బతికిబట్ట కట్టిన సంతానంలో ఎల్లమ్మ రెండోది. ఆదిలాబాద్ జిల్లా బాసరలో జన్మించిన చిందుల ఎల్లమ్మ అసలు పేరు సరస్వతి, ఎల్లమ్మ నాలుగో యేట ఆమె తండ్రికి చూపుపోయింది. అప్పుడే మొక్కులో భాగంగా సరస్వతికి ఎల్లమ్మగా నామకరణం చేసి జోగిణిగా మార్చారు. అప్పటి నుంచి పులింటోళ్ల సరస్వతి కాస్త ఎల్లమ్మగా మారింది. నాలుగేళ్ల వయసులో ముఖానికి రంగు అద్దుకుంది ఎల్లమ్మ. తొలిసారి బాలకృష్ణ వేషం వేసింది. తెరవెనుక ఉన్న వాళ్లు పాటపాడితే తెరముందు ఎల్లమ్మను వదిలి ఆడమని ప్రోత్సహించేవారు. అలా అభినయంలో అడుగు లేయడం మొదలైంది. నాలుగేళ్లలోనే ప్రావీణ్యత సాధించింది. ఆ తరువాతి కాలంలో రంభ వేషం వేసింది. ఇలా ఎప్పుడంటే అప్పుడే, ఎక్కడంటే అక్కడికి తిరుగుతూ బాగోతాలు ఆడుతుండే వారు. 'యాడ వానాకాలం వస్తే అన్నే ఉంటుంటిమి. యాడ ఎవరు సస్తే అన్నే బొందపెడుతుంటిమి. ఎవరికైనా లగ్గం కరారైతే ఆన్నే చేస్తుంటిమి. గోసనాయినా, మా సిందోల్ల బతుకులు' అని ఎల్లమ్మ వాపోయిన సందర్భాలెన్నో.. వైవాహిక జీవితం కన్నా చిందు కళ మీదే ధ్యాస ఎక్కువ కలిగిన ఎల్లమ్మ చాలా పెద్ద మనసే చేసుకున్నారు. ఇక చిందు బాగోతమే తన లోకమనుకుంది. బాల్యం, యవ్వనం, వృద్ధాప్యం ఇలా జీవితంలోని దశలన్నీ చిందు ప్రదర్శనలతోనే దాటేసింది. భర్త, చెల్లెలు, అన్నలతో ఆమె కుటుంబం సంతోషంగా ఉన్నారు. ఆ తరువాత కాలంలో భర్త సైదులు తనను 'అమ్మా' అంటుండె అని ఓ ఇంటర్వ్యూలో చెప్పింది. ఎవరికీ పట్టని తన చిందుల కళకు ప్రపంచం పట్టం కట్టాలె. అందరూ ఆదరించాలె. అదే ఆశ, అదే శ్వాసగా బతికింది. ఎలాగైతేనేం అనుకున్నది సాధించింది. 30ల వరకు ఆడ, మగ రెండు పాత్రలు వేసేది ఎల్లమ్మ. తన అన్న గంగారం హరిశ్చంద్రుడిగా నటిస్తే ఎల్లమ్మ చంద్రమతిగా మారేది. అన్న సత్యవంతుడైతే ఎల్లమ్మ సావిత్రిగా జీవించేది. అన్న వాలిగా నిలబడితే ఎల్లమ్మ సుగ్రీవుడిగా పోటీ పడేది. ఎవరైనా పాత్రధారులు లేకపోతే ఆ పాత్రకు తానే ప్రాణం పోసేది. ఆ తరువాత క్రమంగా చిత్రాంగి, చెంచులక్ష్మి, చంద్రమతి వేషాలు వేసింది. అలా చిందు బాగోతమే ఆమె జీవితంగా మారింది. 1981లో నిజామాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో తొలి అధికారిక ప్రదర్శన. తదనంతర కాలంలో అంతర్జాతీయ ఖ్యాతికి తొలిమెట్టు అయ్యింది. నటరాజ రామకృష్ణ గారితో పరిచయమైన రోజున చెంచులక్ష్మి కథను ప్రదర్శించారు. ఆ ప్రదర్శనకు ముగ్ధుడైన రామకృష్ణ గారు తన శాలువా తీసి ఎల్లమ్మకు కప్పారు. చిందు కళను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. 1986లో నాటి ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు గారు చిందుల ఎల్లమ్మ బృందాన్ని ఢిల్లీ తీసుకెళ్లి "అప్నా ఉత్సవ్"లో ప్రదర్శన ఇప్పించారు. ఆ అప్నా ఉత్సవ్‌లో నాటి ప్రధానమంత్రి రాజీవ్ గాంధీతో పాటు... నాటి రష్యా అధినేత గోర్బచెవ్ దంపతులు వారి ప్రదర్శన చూసి ముగ్ధులయ్యారు. అదే సంవత్సరం చిందుల ఎల్లమ్మను 'హంస' అవార్డుతో ప్రభుత్వం సత్కరించింది. 'కళారత్న అవార్డు', 2004లో 'రాజీవ్' ప్రతిభా పురస్కారాలతో రాష్ట్రప్రభుత్వం తన ఉనికిని చాటుకుంది. 2004 లోనే నిజామాబాద్ నుంచి బోధన్ వరకు గల రహదారికి ఎల్లమ్మ రహదారిగా నామకరణం చేసిన అనతికాలంలోనే కళారూపాన్నే ఇంటిపేరుగా మార్చుకున్న చిందు ఎల్లమ్మ 2005, నవంబర్ 9న శాశ్వత నిద్రలోకి జారుకున్నారు. అయినా అశేష అభిమానుల హృదయాల్లో శాశ్వతంగా కొలువై ఉంది ఈ కళాతపస్వి.



– వి. పద్మ

– బాలచెలిమి డెస్క్

# Oxford
Grammar High School

KNOWLEDGE IS POWER

OGS JUNIORS
grow naturally

43rd YEARS OF MERITORIOUS PERFORMANCE



## We make school time the best time for your kids

At OGS Juniors, all the children are given a warm, safe, and stimulating environment so that they can grow to become individuals while exploring, imagining, creating, and playing.

- Loving atmosphere & play ground
- CCTV surveillance
- Certified teachers & caring staff
- Kids zone & play area
- Interactive & Value based Learning

**CARING TEACHERS & STAFF**
Your child will get the best care and attention

**ECO-FRIENDLY PRACTICES**
We let the children play with nature friendly material

**HUGE PLAYGROUND**
Your child will get lots of fresh air and playtime

**INTERACTIVE LEARNING**
Our trusted method helps your child communicate and learn with ease.

**Street No. 13, Himayathnagar, Hyderabad | Ph : 040 2763 6214, 99590 20512**

BALA CHELIMI, Telugu Children's Monthly Magazine
Date of Publication - 31st July, 2024

RNI Regn. No. 52828/92 TC No. TEL Tel01232

# చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ

హైదరాబాద్ (Regd. 720/1982)

బాలచెలిమి
పిల్లల వికాస పత్రిక

## తెలంగాణ బడి పిల్లల కథలు



**10 పుస్తకాల సెట్ ధర రూ.330 • తగ్గింపు ధర రూ. 300**

పిల్లలకు అత్యంత ఆనందానిచ్చేది ఆట బొమ్మలు, కథల పుస్తకాలే. పాఠ్యపుస్తకాలు అందించే జ్ఞానానికి సమాంతరంగా మరెంతో లోకజ్ఞానాన్ని అందించేది బాల సాహిత్యమే. పుస్తకాలు పిల్లల ఆలోచనా నైపుణ్యాలను పెంచుతాయి. వారి ఊహలకు ప్రాణం పోస్తాయి. వారిలో సృజనాత్మకతను పెంచుతాయి. చరిత్ర, సంస్కృతి, కళలు, సైన్స్, మానవ స్వభావాలు, జంతు స్వభావాలు, ఆరోగ్య సంబంధిత అంశాలు - ఒకటేమిటి ప్రాథమిక విజ్ఞానఖని బాలసాహిత్యం, పిల్లలో నైతికతను, ఆధ్యాత్మికతను, సక్రమమైన ప్రవర్తనను, మంచి చెడుల అవగాహనను పెంచే బాధ్యతను బాలసాహిత్యమే నెరవేర్చగలదు.

ఇవి అచ్చంగా మన పిల్లలు రాసిన కథలు, స్వచ్ఛమైన కథలు. 'చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ' తెలంగాణలోని ఉమ్మడి 10 జిల్లాల **"బడి పిల్లల కథలు"** సంకలనాలుగా అందమైన బొమ్మలతో గతంలో వెలువరించింది. అవి రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ విశేష ఆదరణ పొందాయి.

అలాగే ఇప్పుడు పిల్లలకోసం తెలంగాణలోని ఉమ్మడి పది జిల్లాల బాల సాహిత్య రచయితలు రాసిన **"పెద్దలు రాసిన పిల్లల కథలు"** పది సంకలనాలను అందమైన బొమ్మలతో వెలువరించింది. చిన్నారులు, పెద్దలు, సాహితీ వేత్తలు ఎప్పటివలె ఈ పుస్తకాలను ఆదరిస్తారని ఆశిస్తున్నాం.

-మణికొండ వేదకుమార్
చైర్మన్, చిల్డ్రన్స్ ఎడ్యుకేషన్ అకాడమీ

## పెద్దలు రాసిన పిల్లల కథలు (ఉమ్మడి పది జిల్లాలు)



**10 పుస్తకాల సెట్ ధర రూ.350 • తగ్గింపు ధర రూ. 300**



ప్రతులకు

అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు. మరియు
'భూపతి సదన్' 3-6-716, స్ట్రీట్ నెం.12,
హిమాయత్‌నగర్, హైదరాబాద్-500029
ఫోన్ : 9030 6262 88

*email: edit.chelimi@gmail.com website : www.balachelimi.com*



## చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ ప్రచురించిన ఇతర పుస్తకాలు



Edited, printed, published and owned by Manikonda Vedakumar,
Printed at Deccan Press, H.No.1-9-1126/B, Azamabad, Musheerabad, Hyderabad-500020, Telangana State.
Published at "CHANDRAM", # 3-6-712/2, 12th Street, Himayatnagar, Hyderabad-500029, Telangana.
Editor: Manikonda Vedakumar. RNI Reg No. 52828/92, Tc No: TEL Tel01232.
Cell : 9030626288, Mail ID : edit.chelimi@gmail.com